మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 29-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 330 Issue: 330

Circulated to Telangana
Published from Jagitial

29 మే 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:42 తిథి త్రయోదశి ఉ. 9:51 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం స్వాతి ఉ. 10:32 వరకు తరువాత విశాఖ యోగం పరిఘ తె. 4:280 వరకు కరణం తైతుల ఉ. 9:51 వరకు గరజ రా. 10:54 వరకు వర్జ్యం సా. 4:51 నుండి సా. 6:38 వరకు దుర్ముహూర్తం ఉ. 8:20 నుండి ఉ. 9:12 వరకు మ. 12:39 నుండి మ. 1:31 వరకు రాహుకాలం ఉ. 10:36 నుండి మ. 12:13 వరకు యమగండం మ. 3:27 నుండి సా. 5:05 వరకు గుళికాకాలం ఉ. 7:22 నుండి ఉ. 8:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:09 నుండి తె. 4:57 వరకు అమృత ఘడియలు తె. 3:32 నుండి తె. 5:19 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:39 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# ఎకరా రూ.237 కోట్లు

## రాయదుర్గంలో భూసిరులు

## టీజీఐఐసీ వేలంలో రికార్డు ధర



హైదరాబాద్ నగరంలో భూమి మరోసారి రికార్డు ధర పలికింది. టీజీఐఐసీ వేలంలో ఎకరా భూమి రూ.237 కోట్లు పలికి సరికొత్త రికార్డును సృష్టించింది. రాయదుర్గంలోని పాన్ మక్తాలోని సర్వే నెంబర్ 83/1లో 6 ఎకరాల 29 గుంటలకు వేలం వేశారు. ఈ క్రమంలో టీజీఐఐసీ భూముల వేలానికి అనూహ్య స్పందన లభించింది. ఈ వేలంలో భూమిని గౌర వెంచర్స్ దక్కించుకుంది.

హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఇదే ప్రాంతంలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికిన విషయం తెలిసిందే. ఆరోజు 7 ఎకరాలకు రూ.1,357.59 కోట్లు వచ్చింది. టీజీఐఐసీ వేలం వేసే భూములు మంచి డిమాండ్ ఉంటోంది. సర్వే నెంబర్ 83/1లోని ప్లాట్ 1ఏ, 1ఎఫ్‌లోని 6.29 ఎకరాలు, ప్లాట్ నెంబర్ పీ4లోని 5.09 ఎకరాలు సహా మొత్తం 11.38 ఎకరాల భూమి వేలానికి తరువాయి 2 వ పేజీలో...

# ఇక డీకే జమానా!

## కర్ణాటక సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా

## డీకే శివకుమార్‌కు లైన్ క్లియర్

## సిద్ధరామయ్య భావోద్వేగ ప్రసంగం



కర్ణాటకలో గత కొన్ని రోజులుగా సాగుతున్న ముఖ్యమంత్రి మార్పు ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య గురువారం రాజీనామా చేశారు. తన అధికారిక నివాసం 'కావేరి'లో ఏర్పాటు చేసిన అల్పాహార విందు సమావేశంలో ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. కాంగ్రెస్ హైకమాండ్ తనకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసిందని, కానీ తాను దానిని సున్నితంగా తిరస్కరించానని కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సిద్ధరామయ్య వెల్లడించారు.

బెంగళూరు: తనకు జాతీయ రాజకీయాలపై ఏమాత్రం ఆసక్తి లేదని, ఎమ్మెల్యేగా కొనసాగుతానని తెలిపారు. భవిష్యత్తులోనూ రాష్ట్ర క్రియాశీల రాజకీయాల్లోనే కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు, గురువారం మధ్యాహ్నం బెంగళూరులోని లోక్ భవన్‌లో సిద్ధరామయ్య తన రాజీనామా లేఖ అందజేశారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ వ్యక్తిగత పనులపై తన సొంత ఊరైన ఇండోర్‌లో ఉండటంతో, ఆయన అందుబాటులో లేరు. దీంతో గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ప్రభు శంకర్‌కు సిద్ధరామయ్య తరువాయి 2 వ పేజీలో...

### డీకే.. దేశంలోనే ధనిక ఎమ్మెల్యే

2023 నుంచి డీకే శివకుమార్, ఆయన మద్దతుదారులు ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. ఈ నేపథ్యంలోనే డీకే శివకుమార్ రాజకీయ ప్రస్థానం, ఆయన ఆస్తులు, వ్యాపారాలు, కేసులు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల అఫిడవిట్ దాఖలు చేసిన డీకే శివకుమార్.. దేశంలోనే అత్యంత ధనిక ఎమ్మెల్యేల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం.. తనకు రూ.1413.80 కోట్ల ఆస్తులు ఉన్నట్లు ప్రకటించారు.

# దుమ్ము దుమారం

## పలు చోట్ల భారీ వర్షం



## పలుచోట్ల ఉరుములు మెరుపులు

## కొనుగోలు కేంద్రాల్లో తడిసిన పంట

హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ ఈదురు గాలులు, వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో రైతులు పంట నష్టపోయారు. పంట నీటిపాలు కావడంతో రైతులు ఆందోళన చెందారు. నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, కొమురంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అకాల వర్షాల కారణంగా ధాన్యం తరువాయి 2 వ పేజీలో...

గత మూడు రోజులుగా వరుసగా తగ్గుముఖం పట్టిన పసిడి ధరలు గురువారం మరింత పతనమై హ్యాట్రిక్ తగ్గుదలను నమోదు చేశాయి. దీంతో కొనుగోలుదారుకు బంగారం ధరలు కలిసివచ్చాయి. ఇక వెండి ధరలు కూడా భారీస్థాయిలో దిగొచ్చాయి.




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,606 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,810 |

### విశ్వవాణి



సింహాల గుంపుల్లో అసలు నాయకత్వం ఆడ సింహాలదే. ఎక్కువగా వేటాడేది, పిల్లలను కలిసి పెంచేది, గుంపుకు ఆహారం సమకూర్చేది ఆడ సింహాలే. మగ సింహాలు మాత్రం రోజుకు సుమారు 16-20 గంటలు విశ్రాంతి తీసుకుంటాయి.

# వరి సాగు తగ్గాలె!

## రాష్ట్రాలకు కేంద్రం కళ్లెం.. 5 ఏళ్లలో 25 లక్షల ఎకరాలు తగ్గాలని టార్గెట్



గత కొన్నేళ్లుగా తెలంగాణలో విపరీతంగా వరిధాన్యం పండుతోంది. రైతులు పంట విస్తీర్ణాన్ని పెంచడమే కాకుండా.. మెరుగైన విత్తనాలు, పురుగు మందులు, సరైన సాగు పద్దతులతో వరి ఉత్పత్తిలోనూ భారీగా దిగుబడులు సాధిస్తున్నారు. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఏటా వరి ఉత్పత్తి భారీగా పెరుగుతోంది.

న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): ఈ నేపథ్యంలోనే దేశంలోనే వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేసే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ కూడా చేరిపోయింది. అయితే దేశవ్యాప్తంగా బియ్యం, వడ్ల నిల్వలు భారీగా పేరుకుపోతున్నాయి. గోదాముల్లో భారీగా నిల్వ ఉండటంతో.. ఇటీవలె కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రబీ పంట కొనుగోళ్లు ప్రారంభం కాకముందే.. 3 నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని దేశవ్యాప్తంగా ఒకేసారి ఏప్రిల్ నెలలో జారీ చేసింది. దీంతో గోదాముల్లో కాస్త ఖాళీ ఏర్పడింది. అయితే పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రతీసారి ఇలాగే చేయలేమని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా వరి పంట సాగును తగ్గించాలనే టార్గెట్ పెట్టుకుంది. ఈ క్రమంలోనే తెలంగాణలో రికార్డు స్థాయిలో పెరుగుతున్న వరి సాగుపై కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి.. పంటల మార్పిడిని ప్రోత్సహించడమే లక్ష్యంగా సరికొత్త ప్రణాళికను రెడీ చేసింది. దేశవ్యాప్తంగా రాబోయే 5 ఏళ్లలో ఏకంగా 2.5 కోట్ల ఎకరాల తరువాయి 2 వ పేజీలో...



# ప్రతి ఒక్కరికి సంక్షేమ కార్డు

## ఆధార్ తరహాలో ప్రత్యేక నంబర్.. అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత.. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. వృద్ధులు, వితంతువులు, మహిళలు, చిన్న పిల్లలు, యువకులకు ఇలా ఒక్కొక్కరికీ ఒక్కో రకమైన సంక్షేమ పథకాలు అందుతున్నాయి. అయితే రాష్ట్ర ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయానికి తెరతీసింది. రాష్ట్రంలోని ప్రతీ పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను అన్నింటినీ ఒకే కార్డులో నిక్షిప్తం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సమగ్ర సంక్షేమ కార్డును రూపొందించాలని భావిస్తోంది.

హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): ఈ క్రమంలోనే తాజాగా సీఎం రేవంత్ రెడ్డి.. అన్ని శాఖల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా.. ఏ పథకం కింద.. ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా స్పష్టంగా తెలియజేసేలా దాన్ని తయారు చేయాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. అందుకు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని.. అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. తాజాగా నిర్వహించిన ఈ సమీక్షలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన తరువాయి 2 వ పేజీలో...

# సామాన్యులకు ఊరట

## బడా బాబులకు వాత.. పాన్ కార్డుపై కొత్త రూల్స్

పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరుపుతూ పన్ను ఎగవేసే వారికి కేంద్ర ఆదాయపు పన్ను శాఖ గట్టి షాక్ ఇచ్చింది. ఆర్థిక లావాదేవీల్లో మరింత పారదర్శకత తెచ్చేందుకు, పన్ను ఎగవేతదారులకు చెక్ పెట్టేందుకు పాన్ కార్డ్ నిబంధనలను సవరించింది.




న్యూఢిల్లీ: కొన్ని చిన్న చిన్న లావాదేవీలకు పాన్ పరిమితులను సడలిస్తూ సామాన్యులకు ఊరటనిచ్చిన ఐటీ శాఖ.. అదే సమయంలో భారీ లగ్జరీ ఖర్చులు, ఆస్తి కొనుగోళ్లు, ఈవెంట్ పేమెంట్లపై మాత్రం నిఘా నెత్రాన్ని మరింత కఠినతరం చేసింది. మధ్యతరగతి, సాధారణ బ్యాంక్ ఖాతాదారులకు ఐటీ శాఖ పెద్ద ఊరటనిచ్చింది. అనవసరపు నోటీసుల టెన్షన్ తగ్గించేలా -2 వ పేజీలో...



# అమర జవాన్ల కుటుంబాలకు ఉపాధి

## భారత సైన్యంతో ఎయిరిండియా ఒప్పందం

న్యూఢిల్లీ: దేశ రక్షణలో ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు, సైనిక దివ్యాంగుల పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ టాటా గ్రూప్ యాజమాన్యంలోని ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. యుద్ధ వితంతువులు(వీర నారీ-యుద్ధంలో భర్తలను కోల్పోయినవారు), వారి పిల్లలకు ఉపాధి అవకాశాలు తరువాయి 2 వ పేజీలో...



# భారత మామిడిపై జపాన్ నిషేధం

## క్వారంటైన్ నిబంధనల్లో లోపాలు ఉన్నాయని గుర్తింపు

టోక్యో: భారత మామిడి ఎగుమతిదారులకు జపాన్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఈ సీజన్‌కు గాను భారత మామిడి పండ్ల దిగుమతులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లోని క్రిమిసంహారక తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

29.5.2026

మేషం: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబంలో చిక్కులు తొలగుతాయి. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

వృషభం: ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. సన్నిహితులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

మిధునం: వృత్తి వ్యాపారాలలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. బంధువుల నుంచి ఋణ ఒత్తిడులు తప్పవు. ఆర్థికపరమైన సమస్యలు చికాకు కలిగిస్తాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. చేపట్టిన పనులలో ఎంత కష్టించినా ఫలితం ఉండదు. ఉద్యోగ వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

కర్కాటకం: కీలక వ్యవహారాలలో ఆప్తుల సలహాలు కలసివస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి.

సింహం: వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాల వలన నష్టాలు తప్పవు. దైవదర్శనాలు చేసుకుంటారు. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఉద్యోగాలలో ఉన్నతాధికారుల నుండి ఆటుపోట్లు తప్పవు.

కన్య: ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. సన్నిహితుల నుండి విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలు మరింత పుంజుకుంటాయి.

తుల: కుటుంబంలో చిన్నపాటి సమస్యలు ఉంటాయి. ఇంటాబయట నిరాశ తప్పదు. వ్యాపారాలు కొంత మందకోడిగా సాగుతాయి. బంధువుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపార వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. నిరుద్యోగ ప్రయత్నాల్లో ఆటంకాలు కలుగుతాయి.

వృశ్చికం: ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో నూతన బాధ్యతలు పెరుగుతాయి.

ధనస్సు: ప్రయాణాలు శ్రమతో కూడుకుని ఉంటాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. బంధువులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. అనుకున్న పనుల్లో అవాంతరాలు తప్పవు. నూతన ఋణయత్నాలు చేస్తారు. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండడం మంచిది.

మకరం: ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అవసరానికి ధనం అందుతుంది. దూరప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. సన్నిహితులతో విభేదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు సాదాసీదాగా ఉంటాయి. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది.

కుంభం: కుటుంబ విషయాలలో తొందరపాటు నిర్ణయం చేయడం మంచిది కాదు. మిత్రుల నుంచి విమర్శలు కలుగుతాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో ఇతరులతో నిదానంగా ప్రవర్తించడం మంచిది.

మీనం: సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. వ్యాపార, ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది.

# ఇక డీకే జమానా!



**మొదటి పేజీ తరువాయి**

తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ సమయంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఇతర కేబినెట్ సహచరులు ఆయన వెంట ఉన్నారు. రాజీనామా చేయడానికి ముందు సిద్ధరామయ్య తన నివాసంలో కేబినెట్ మంత్రులకు అల్పాహార విందు ఇచ్చారు. ఈ సందర్భంగా, కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాల మేరకు తాను సీఎం పదవి నుంచి వైదొలగుతున్నానని, తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడతారని మంత్రులకు తెలియజేశారు. తాను రాజీనామా లేఖను స్వీకరించానని, దీనిపై గవర్నర్ తుది నిర్ణయం తీసుకుని ఆమోదిస్తారని ప్రత్యేక కార్యదర్శి ప్రభు శంకర్ మీడియాకు తెలిపారు. ఈ వార్త వెలువడగానే బెంగళూరులోని సదాశివనగర్‌లో ఉన్న డీకే శివకుమార్ నివాసం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఆయన మద్దతుదారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నినాదాలు చేస్తూ, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. దీంతో ఆయన నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

రాజ్యసభకు వెళ్లనని చెప్పా: సిద్ధరామయ్య

రాజీనామా ప్రకటన చేసిన సిద్ధరామయ్య.. డీకే శివకుమార్‌ను ఆలింగనం చేసుకున్నారు. అనంతరం శివకుమార్, సిద్ధరామయ్య పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. కొంత భావోద్వేగానికి గురైన సిద్ధరామయ్య.. 2006లో కాంగ్రెస్ పార్టీలో చేరానని, అప్పటి నుంచి పార్టీ తనను ఎంతో ఆదరించిందని గుర్తుచేసుకున్నారు. మంత్రిగా, రెండుసార్లు సీఎంగా, ప్రతిపక్ష నేతగా తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని తెలిపారు. ఏడు కోట్ల కన్నడ ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టమన్నారు. తాను ముఖ్యమంత్రి అవుతానని కలలో కూడా అనుకోలేదని సిద్ధరామయ్య అన్నారు. తన కుటుంబంలో ఎవరికీ రాజకీయ నేపథ్యం లేదని, తాను గ్రామీణ జీవితం నుంచి వచ్చానని, పొరపాటున రాజకీయాల్లోకి అడుగుపెట్టానని వ్యాఖ్యానించారు. తన రాజకీయ జీవితంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ, ముఖ్యంగా తనకు సీఎం అయ్యే అవకాశం కల్పించిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిగా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించానని చెప్పారు. సామాజిక న్యాయం, సమానత్వాన్ని తాను బలంగా నమ్ముతానని, సమాజంలో అసమానతలు తొలగిపోయి అందరికీ సమాన అవకాశాలు దక్కాలన్నదే తన ఆకాంక్ష అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. తన రాజీనామాను గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం తనకుందని ఆయన తెలిపారు.

### దేశంలోనే ధనిక ఎమ్మెల్యే

2023 నుంచి డీకే శివకుమార్, ఆయన మద్దతుదారులు ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. ఈ నేపథ్యంలోనే డీకే శివకుమార్ రాజకీయ ప్రస్థానం, ఆయన ఆస్తులు, వ్యాపారాలు, కేసులు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల అఫిడవిట్ దాఖలు చేసిన డీకే శివకుమార్.. దేశంలోనే అత్యంత ధనిక ఎమ్మెల్యేల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం.. తనకు రూ.1413.80 కోట్ల ఆస్తులు ఉన్నట్లు ప్రకటించారు. వీటితోపాటు.. ఇతర ఖరీదైన వాణిజ్య ఆస్తులు, లగ్జరీ వాచ్‌లు, స్టాక్ మార్కెట్‌లో కోట్ల రూపాయల పెట్టుబడులు ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో డీకేఎస్‌కు రూ.263 కోట్ల అప్పులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో డీకే కుటుంబానికి చరాస్తులు రూ.273.42 కోట్లు ఉండగా.. స్థిరాస్తులు రూ.1140.36 కోట్లు ఉన్నట్లు తెలిపారు. ఇక డీకే శివకుమార్ ఒక్కడి పేరు మీదనే రూ.972.65 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. కనకపుర నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన డీకే శివకుమార్ 2018 ఎన్నికల సమయంలో తన ఆస్తులు రూ.840.08 కోట్లు ఉన్నట్లు పేర్కొనగా.. ఆ తర్వాత 5 ఏళ్లలోనే దాదాపు రెట్టింపై రూ.1413.80 కోట్లు కావడం విశేషం. అంతేకాకుండా డీకే శివకుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు పలు బ్యాంకుల్లో రూ. 16 కోట్లకు పైగా డిపాజిట్లు ఉన్నట్లు తెలిపారు. ఇవి మాత్రమే కాకుండా షేర్లు, స్టాక్ మార్కెట్‌లో కూడా డీకేఎస్ పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడించారు. పలు కంపెనీల్లో డీకేఎస్ రూ. 4.20 కోట్ల పెట్టుబడులు పెట్టగా.. రూ.9 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు.. బంగారం, వెండి, వజ్రాల వంటి విలువైన ఆభరణాలు కూడా ఉన్నాయి. అంతేక్కకుండా రూ.లక్షల విలువైన రోలెక్స్, హుబ్లోట్ చేతి గడియారాలు కూడా డీకే శివకుమార్ కలెక్షన్‌లో ఉన్నాయి. డీకే శివకుమార్, ఆయన భార్య ఉష.. ముగ్గురు పిల్లలకు ఉన్న ఆభరణాల మొత్తం విలువ 3.82 కోట్లకు పైగా ఉంటుందని ఒక అంచనా. అంతేకాకుండా డీకే శివకుమార్ భార్య ఉష పేరు మీద రూ.30 కోట్ల వ్యవసాయ భూమి.. ఢిల్లీ, బెంగళూరుల్లోని పలు ప్రాంతాల్లో రూ. 84 కోట్ల పైగా విలువైన ఇళ్లు, ఫ్లాట్లు ఉన్నాయి. డీకే శివకుమార్‌కు రూ. 900 కోట్ల విలువైన గ్లోబల్ మాల్ ఉందని ప్రచారం జరుగుతోంది. కానీ అధికారికంగా మాత్రం అది డీకే శివకుమార్‌ది అని ఎవరూ ప్రకటించలేదు. ఇక డీకేఎస్ పేరు మీద ఒకే ఒక్క కారు ఉండగా.. అది టయోటా క్వాలిస్ అని పేర్కొన్నారు. 2023 ఎన్నికల అఫిడవిట్‌లో తనపై 19 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. డీకే శివకుమార్ ప్రస్తుతం కర్ణాటక ఉప ముఖ్యమంత్రిగా, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. 1980లో రాజకీయాల్లోకి అరంగేట్రం చేసిన డీకే శివకుమార్.. 1985లో తొలిసారి సాతనూరు నియోజకవర్గం నుంచి హెచ్‌డీ దేవేగౌడపై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 1989లో అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి తొలిసారిగా కర్ణాటక అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1994, 1999 ఎన్నికల్లోనూ సాతనూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా వరుసగా హ్యాట్రిక్ విజయాలు సాధించారు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2008, 2013, 2018, 2023 ఎన్నికల్లో కనకపుర నియోజకవర్గం నుంచి పోటీ చేసిన డీకేఎస్.. భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ క్రమంలోనే కర్ణాటకలో ఇంధనం, పట్టణాభివృద్ధి సహా పలు మంత్రి పదవులను నిర్వహించారు. కర్ణాటక రాజకీయాల్లో ట్రబుల్ షూటర్‌గా డీకే శివకుమార్‌కు మంచి పేరు ఉంది. 2017 రాజ్యసభ ఎన్నికల సమయంలో ఫిరాయింపుల భయంతో గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరులోని ఒక రిసార్ట్‌కు తరలించినప్పుడు డీకే శివకుమార్ ట్రబుల్ షూటర్‌గా మారి నేషనల్ లెవల్ పాలిటిక్స్‌లో అందరి దృష్టిని ఆకర్షించారు.

# ప్రతి ఒక్కరికి సంక్షేమ కార్డు

**మొదటి పేజీ తరువాయి**

కార్యదర్శి కే రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరై.. ప్రత్యేకంగా చర్చించారు. ఈ సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో మరింత పారదర్శకత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని.. అదే సమయంలో అనర్హులను గుర్తించడం కూడా చాలా ఈజీ అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతీ శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు.. ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సీఎం రేవంత్ సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ సమగ్ర సంక్షేమ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్‌ను కూడా ఇచ్చేలా ఆలోచన చేయాలని సూచించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ సమగ్ర సంక్షేమ కార్డుకు అనుసంధానం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులకు చెప్పారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఈ సమగ్ర సంక్షేమ కార్డుకు ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే.. వెంటనే ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని.. దాని ఆధారంగా వెంటనే చర్యలు మొదలయ్యేలా ఉండాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని వెల్లడించారు. కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సీఎం సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్ట్‌లు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే.. అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు కచ్చితంగా చేరేలా.. ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### అమర జవాన్ల కుటుంబాలకు ఉపాధి

**మొదటి పేజీ తరువాయి**

కల్పించడంతో పాటు ఆర్మీ ప్రత్యేక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా భారత సైన్యంతో ఎయిరిండియా సహకార ఒప్పందం కుదుర్చుకుంది. దేశ నిర్మాణంలో, సామాజిక బాధ్యతలో కార్పొరేట్ రంగానికి ఆదర్శంగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు కంపెనీ అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఈ వినూత్న భాగస్వామ్యం ద్వారా వీర నారీలు, వారి పిల్లలకు 'ఎయిరిండియా శాట్స్ ఎయిర్ పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్' (ఏఐ సాట్స్)లో స్థిరమైన ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ కార్యక్రమం కింద ప్రాథమికంగా 20 మంది యుద్ధ వితంతువులను, 40 మంది వారి పిల్లలను ఎయిర్‌లైన్స్ ఉద్యోగాల్లోకి తీసుకోనున్నారు. వీరికి విమానాశ్రయ కార్యకలాపాల్లో కీలకమైన కస్టమర్ సేవలు, లోడ్ అండ్ కంట్రోల్, ర్యాంప్ ఆపరేషన్స్ విభాగాల్లో బాధ్యతలు అప్పగిస్తారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వీరికి శిక్షణ అందిస్తారు. తద్వారా దీర్ఘకాలిక సామాజిక-ఆర్థిక సాధికారతను పెంపొందిస్తూ ఉద్యోగానికి తక్షణమే సిద్ధమయ్యేలా అభ్యర్థులను తీర్చిదిద్దుతారు. కంటోన్మెంట్ ప్రాంతాల్లో నివసిస్తున్న సైనికులు, పూర్వ సైనికోద్యోగులు (అనుభవజ్ఞులు), దివ్యాంగుల పిల్లల సంక్షేమం కోసం భారత సైన్యం ప్రత్యేకంగా 'ఆశా' (ఆర్మీ స్పెషల్ హెల్ప్ అండ్ అసోసియేషన్) పాఠశాలలను నిర్వహిస్తోంది. ఈ చిన్నారులకు నాణ్యమైన విద్యా వైద్యంతో పాటు దీర్ఘకాలిక భవిష్యత్తును అందించేందుకు ఎయిరిండియా వృత్తి శిక్షణా మౌలిక సదుపాయాలను నిర్మించనుంది. దేశవ్యాప్తంగా ఉన్న 25 ఆశా పాఠశాలల్లో అత్యాధునిక వృత్తి శిక్షణా ప్రయోగశాలలను ఏర్పాటు చేయడమే ఈ చొరవ ముఖ్య లక్ష్యం. ఇందులో భాగంగా ఇప్పటికే 10 పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతంగా ప్రారంభం కాగా, త్వరలోనే మిగిలిన 15 పాఠశాలలకు కూడా దీనిని విస్తరించనున్నారు. చిన్నారుల సృజనాత్మకతను, సాంకేతిక నైపుణ్యాలను వెలికితీసేలా ఈ ల్యాబ్‌ల్లో విభిన్న విభాగాలపై అనుభవపూర్వక శిక్షణ ఇవ్వనున్నారు. అందులో భాగంలో ఫోటోగ్రఫీ, విజువల్ స్టోరీ టెల్లింగ్, మ్యూజిక్, పెయింటింగ్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, కుకింగ్, హాస్పిటాలిటీ, బ్యూటీ అండ్ వెల్నెస్, బోటిక్ అండ్ టైలరింగ్, ఎలక్ట్రికల్, ఇతర సాంకేతిక నైపుణ్యాలు, క్రీడల్లో శిక్షణ ఇ□స్తారు. భారత సైన్యంతో కుదిరిన ఈ చారిత్రాత్మక ఒప్పందంపై ఎయిరిండియా గవర్నెన్స్, రిస్క్, కంప్లయన్స్, కార్పొరేట్ వ్యవహారాల గ్రూప్ హెడ్ పి.బాలాజీ మాట్లాడుతూ 'భారత సైన్యంతో ఎయిరిండియా భాగస్వామ్యం కేవలం ఒక ఒప్పందం మాత్రమే కాదు; ఇది దేశ నిర్మాణ ప్రయత్నంలో భాగం కావాలనే మా ఉమ్మడి సంకల్పానికి ప్రతిరూపం. నైపుణ్యాలను బలోపేతం చేయడం, సరైన అవకాశాల ద్వారా సమాజంలో గౌరవాన్ని, సాధికారతను పెంపొందించడమే ఈ రెండు కార్యక్రమాల ముఖ్య ఉద్దేశం. సైన్యంతో కలిసి పనిచేస్తూ భవిష్యత్తులో స్థిరమైన, సానుకూల ప్రభావాన్ని చూపే ఒక స్కేలబుల్ మోడల్‌ను రూపొందించడానికి మేము కట్టుబడి ఉన్నాం' అన్నారు.

### వరి సాగు తగ్గాలె!

**మొదటి పేజీ తరువాయి**

(250 లక్షల ఎకరాలు) మేర వరి సాగును తగ్గించాలని ఒక భారీ లక్ష్యాన్ని పెట్టుకుంది. ఇందులో తెలంగాణ వాటా 10 శాతం. అంటే తెలంగాణలో రానున్న ఐదేళ్లలో ఏకంగా 25 లక్షల ఎకరాల్లో వరి సాగును తగ్గించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతీ సంవత్సరం 5 లక్షల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించాలని.. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. తెలంగాణలో వరి సాగు రికార్డులు సృష్టిస్తుండగా.. గడిచిన 3 ఏళ్లలోనే సాగు విస్తీర్ణం ఏకంగా 16 లక్షల ఎకరాలు పెరిగి.. మొత్తంగా 133 లక్షల ఎకరాలకు చేరింది. దీంతో ఏటా సుమారు 3 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతోంది. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం.. ప్రతీ గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కావడంతో వరి పంటను పండించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతోపాటు.. సన్న వడ్లు పండిస్తే.. క్వింటాలుకు రూ.500 అదనపు బోనస్ ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించడంతో.. తెలంగాణ రైతులు వరి పంట వైపే మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ గోదాముల్లో నిల్వలు పేరుకుపోయి.. స్థలం లేక తీవ్ర సమస్య తలెత్తింది.

### భారత మామిడిపై జపాన్ నిషేధం

**మొదటి పేజీ తరువాయి**

కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు సరిగా లేవని జపాన్ తనిఖీ బృందం గుర్తించడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ పరిణామంతో మామిడి ఎగుమతిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని రెహ్మాన్‌పూర్‌లో ఉన్న ఒక ప్లాంట్‌లో వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ (వీహెచ్ టీ) ప్రక్రియలో లోపాలు ఉన్నట్లు జపాన్ అధికారులు గుర్తించారు. పండ్లను తెగుళ్లు, కీటకాల నుంచి రక్షించడానికి ఈ ప్రక్రియ చాలా కీలకం. ఈ నేపథ్యంలో, మార్చి 2 తర్వాత జారీ చేసిన భారతీయ సర్టిఫికెట్లతో వచ్చే మామిడి షిప్‌మెంట్‌లను అంగీకరించబోమని జపాన్‌కు చెందిన యెకోహామా ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ నిషేధం కారణంగా కేసర్, అల్ఫాన్సో, లంగ్రా, బంగినపల్లి వంటి ప్రసిద్ధ రకాల ఎగుమతులు నిలిచిపోయాయి. భారత మామిడి ఎగుమతిదారులు ఇప్పటికే పలు సవాళ్లతో సతమతమవుతున్నారు. పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఎగుమతులు 20-30 శాతం పడిపోయాయి. రవాణా ఖర్చులు పెరగడంతో పాటు, కంటైనర్ల కొరత కూడా వేధిస్తోంది. మరోవైపు, దేశంలో తీవ్రమైన వడగాడ్పుల వల్ల పంట దిగుబడి తగ్గింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జపాన్ నిషేధం వారిని మరింత కుంగదీసింది. 1986 నుంచి 2006 వరకు కూడా పండ్ల ఈగల కారణంగా జపాన్ భారత మామిడిపై నిషేధం విధించింది. వీహెచ్ టీ ప్రక్రియను అమలు చేశాకే ఆ నిషేధాన్ని ఎత్తివేశారు. ప్రస్తుత సమస్యను పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం జపాన్‌తో చర్చలు జరుపుతున్నప్పటికీ, ఈ సీజన్‌లో ఎగుమతులు తిరిగి ప్రారంభం కావడం కష్టమేనని నిపుణులు భావిస్తున్నారు. ఈ అవకాశాన్ని పాకిస్థాన్, వియత్నాం, థాయ్‌లాండ్ వంటి దేశాలు అందిపుచ్చుకుంటున్నాయి.

### దుమ్ము దుమారం

**మొదటి పేజీ తరువాయి**

కొనుగోలు కేంద్రాల్లోని వడ్లు, మక్కలు తడిసి ముద్దయ్యాయి. పలు ప్రాంతాల్లో ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్, పెంబి మండలాలు, కొమురంభీమ్ జిల్లా కాగజ్ నగర్, కౌటాల మండలాల్లో అకాల వర్షాలతో ధాన్యం తడిసిముద్దయింది. ఇదిలా ఉండగా, పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. తూర్పు, ఉత్తర తెలంగాణకు వడగాల్పుల హెచ్చరికను వాతావరణ శాఖ జారీ చేసింది. వచ్చే రెండు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గాయి. కొన్ని రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలకు తాజా వాతావరణం ఊరటనిచ్చింది.

# సామాన్యులకు ఊరట

**మొదటి పేజీ తరువాయి**

కొన్ని సడలింపులు ఇచ్చింది. గతంలో ఏడాదిలో రూ. 2.5 లక్షలు దాటితేనే ఐటీ శాఖ నిఘా ఉండేది. ఇప్పుడు ఆర్థిక సంవత్సరంలో క్యాష్ డిపాజిట్లు లేదా విత్‌డ్రాయల్స్ రూ. 10 లక్షలకు మించితేనే పాన్ రిపోర్టింగ్ పరిధిలోకి వస్తాయి. ఒకరోజులో రూ. 50 వేలకు పైగా క్యాష్ డిపాజిట్ చేస్తే పాన్ ఇవ్వాలన్న పాత నిబంధనను తొలగించారు. పే ఆర్డర్స్, బ్యాంకర్ చెక్స్, బ్యాంక్ డ్రాఫ్ట్ కోసం రోజూ పాన్ కార్డ్ సమర్పించాల్సిన అవసరం లేదు. ఫారెక్స్ కొనుగోళ్లకు, విదేశీ ప్రయాణాల ఖర్చులకు కూడా ప్రత్యేక పాన్ కేటగిరీని రద్దు చేశారు. ఆస్తి కొనుగోలు, విక్రయాల విషయంలో పన్ను నిబంధనలను కేంద్రం పూర్తిగా మార్చేసింది. భారీ ప్రాపర్టీ డీల్స్ చేసి పన్నులు ఎగ్గొట్టే వారికి చెక్ పెట్టింది. రూ. 45 లక్షలకు మించి జరిగే ఎలాంటి ప్రాపర్టీ డీల్స్‌కైనా ఇకపై పాన్ కార్డును కచ్చితంగా సమర్పించాల్సిందే. ఆస్తి లావాదేవీలకు పాన్ కోటింగ్ పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచారు. గతంలో పాన్ కార్డ్ లేని వారు ఫారం-60 సబ్మిట్ చేసి భారీ ప్రాపర్టీ డీల్స్ చేసేవారు. ఇకపై ఆ ఆటలు సాగవు. పెద్ద డీల్స్ కు పాన్ నంబర్ ఇవ్వాల్సిందే. పెద్ద పెద్ద ఈవెంట్లు, లగ్జరీ హోటళ్లలో భారీగా నగదు చేతులు మారడంపై ఐటీ శాఖ ఫోకస్ పెట్టింది. హోటల్స్, రెస్టారెంట్లలో క్యాష్ పేమెంట్ల పరిమితిని రూ. 50 వేల నుంచి రూ. 1 లక్షకు పెంచారు. రూ. 1 లక్ష బిల్లు దాటితే పాన్ కార్డ్ ఇవ్వాల్సిందే. పెళ్లిళ్లు, పెద్ద ఈవెంట్ల ఖర్చులను ట్రాక్ చేసేందుకు.. హోటల్స్, కన్వెన్షన్ సెంటర్లు, బాంక్వెట్ హాల్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు చేసే భారీ చెల్లింపులకు కూడా ఈ పాన్ రూల్స్ వర్తింపజేస్తున్నారు.

### అందుబాటులోకి ఐటీఆర్--2

న్యూఢిల్లీ: ఆదాయపన్ను శాఖ 2026--27 అసెస్‌మెంట్ సంవత్సరానికి (2025--26 ఆర్థిక సంవత్సరం) ఐటీఆర్--2 (రిటర్నుల పత్రం)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఈ ఫైలింగ్ పోర్టల్‌పై రిటర్నుల దాఖలు సాధ్యపడుతుంది. వ్యాపారం లేదా వృత్తి నుంచి ఎలాంటి ఆదాయం లేని వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్‌లు), మూలధన లాభాలు ఆర్జించి ఉంటే ఐటీఆర్--2ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 15న ఐటీఆర్--1, ఐటీఆర్--4 పత్రాలను సైతం ఆదాయపన్ను శాఖ అందుబాటులోకి తేవడం గమనార్హం. వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లింపుదారులు ఐటీఆర్--1, 2 దాఖలుకు జూలై 31 తుది గడువుగా ఉంది. అదనంగా, ఈసారి ఐటీఆర్--2 ఫారంలో పన్ను చెల్లింపుదారుల కోసం కొన్ని కీలక మార్పులు చేసినట్లు ఆదాయపన్ను శాఖ వెల్లడించింది. ముఖ్యంగా విదేశీ ఆస్తులు, క్రిప్టో కరెన్సీ లావాదేవీలు, అధిక విలువ గల పెట్టుబడుల వివరాలను మరింత స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది.

# ఎకరా రూ.237 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

నోటిఫికేషన్ వచ్చింది. ఎకరాకు రూ.139 కోట్ల ధరను నిర్ధారించారు. ఈ వేలం ద్వారా రూ.2 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని టీజీఐఐసీ అంచనా వేస్తోంది. ప్లాట్ నెంబర్ పీ4లోని భూములకు జూన్ 1న ఆన్ లైన్ లో వేలం నిర్వహించనున్నారు.

# ప్రభుత్వ బడుల్లో ప్రీ-ప్రైమరీ

**కొత్తగా 2,769 పాఠశాలల్లో ప్రారంభం**

హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా ఈ తరగతులను విస్తరిస్తున్న ప్రభుత్వం.. ఈ విద్యా సంవత్సరం (2026-27) నుంచే కొత్తగా 2,769 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విభాగాలు ప్రారంభించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే చిన్నారులను ఆకర్షించేలా, ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని వసతులతో కూడిన ప్రాథమిక విద్యను అందుబాటులోకి తీసుకురావడం ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వం కొత్తగా అనుమతించిన ఈ 2,769 స్కూళ్లను రెండు ప్రధాన రీజియన్లుగా విభజించారు. ఇందులో క్యూర్ రీజియన్ పరిధిలో 529 విభాగాలు, నాన్ క్యూర్ రీజియన్ పరిధిలో 2,240 విభాగాలు ఉన్నాయి. ఈ ప్రీ-ప్రైమరీ విభాగాలను తక్షణమే ప్రారంభించేందుకు వీలుగా అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఉన్నత స్థాయి ఆదేశాలు జారీ చేసింది. ఈ విభాగాల నిర్వహణ కేవలం భవనాలకే పరిమితం కాకుండా.. అత్యంత నైపుణ్యం కలిగిన సిబ్బందితో నడవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం వేతన ప్రాతిపదికన ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లను, చిన్నారుల సంరక్షణ కోసం ఆయాలను నియమించే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. దీనివల్ల స్థానికంగా ఉండే అర్హులైన వారికి ఉపాధి లభించడంతో పాటు పాఠశాలల పర్యవేక్షణ కూడా సమర్థవంతంగా జరుగుతుంది. ప్రీ-ప్రైమరీ తరగతులకు వచ్చే చిన్నారులు అంటే మూడు నుండి ఐదు ఏళ్ల లోపు వారు కాబట్టి.. వారికి ఆహ్లాదకరమైన, ఆకర్షణీయమైన వాతావరణం కల్పించడం అత్యవసరం. ఇందుకోసం ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఎంపిక చేసిన ప్రతి పాఠశాలకు రూ. లక్ష చొప్పున మౌలిక వసతుల కల్పన కోసం మంజూరు చేయనుంది. ఈ నిధులతో తరగతి గదులను ఆధునీకరించనున్నారు. గోడలపై రంగురంగుల వాల్ పెయింటింగ్స్, పిల్లలకు సరిపోయే చిన్న తరహా బెంచీలు, బ్లాక్ బోర్డులు, విద్యా సంబంధిత ఆట వస్తువులు, చార్టులను ఏర్పాటు చేస్తారు. కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా.. ఆటపాటల ద్వారా విద్యాబోధన చేసేలా పాఠ్యాంశాలను కూడా రూపొందించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా విద్యాశాఖ చాలా



కాలంగా కసరత్తు చేస్తోంది. గతంలో ప్రయోగాత్మకంగా 1000 ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించగా.. అక్కడ విద్యార్థుల నమోదు భారీగా పెరగడంతో పాటు తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన లభించింది. ఆ ఫలితాల ఆధారంగానే ఈ ఏడాది మరిన్ని పాఠశాలలకు దీన్ని విస్తరించారు. ఈ నిర్ణయం వల్ల తల్లిదండ్రులకు ప్రైవేట్ స్కూళ్లలో అయ్యే వేల రూపాయల ఫీజుల భారం తప్పడమే కాకుండా.. చిన్న వయసు నుంచే విద్యార్థులు ప్రభుత్వ బడుల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్‌కు 74, హన్మకొండకు 39, కరీంనగర్‌కు 58, వరంగల్‌కు 48 చొప్పున రాష్ట్రంలోని అన్ని 33 జిల్లాల్లోని ఎంపిక చేసిన పాఠశాలలకు ఈ అనుమతులు లభించాయి.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

\- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## సిద్ధమవుతోన్న కాజీపేట రైళ్ల తయారీ యూనిట్

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి**

న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): రాష్ట్రంలోని కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చిందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని అన్నారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్ సిటీ రైళ్లను తయారు చేస్తుందని అన్నారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇక్కడ తయారయ్యే రైళ్లను దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయని అన్నారు. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయని అన్నారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రైళ్లను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ రైళ్లలో రీజనరేటివ్ బ్రేకింగ్ ఉంటుందని అన్నారు. రైలు బ్రేకులు వేసినప్పుడు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే ఆధునాతన పరిజ్ఞానంతో తయారు చేస్తున్నామని అన్నారు.

## జగన్ పీఏ కేఎన్‌ఆర్ నివాసంలో సిట్ తనిఖీలు

విజయవాడ, మే 28 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఇందులో భాగంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కె.నాగేశ్వరరెడ్డి (కేఎన్‌ఆర్) నివాసంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం తనిఖీలు చేపట్టింది. మద్యం లావాదేవీలకు సంబంధించి విజయవాడలోని ఆయన నివాసంలో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు, సిట్ కార్యాలయంలో కేఎన్‌ఆర్‌ను అధికారులు విచారిస్తున్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి ఆయనను ప్రశ్నిస్తున్నారు. బుధవారం కూడా కేఎన్‌ఆర్‌ను సిట్ అధికారులు దాదాపు 9.5 గంటల పాటు విచారించిన విషయం తెలిసిందే. విచారణలో ఆయన పొంతనలేని సమాధానాలు ఇస్తున్నట్లు సమాచారం. సిట్ దర్యాప్తులో కేఎన్‌ఆర్ ఆస్తులకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆయన భార్య శశికళ పేరిట తిరుపతి జిల్లాలో 10 ఎకరాల భూమి ఉన్నట్లు, ఆమె బ్యాంకు ఖాతాలో 2019-24 మధ్య సుమారు రూ. 19.86 కోట్లు జమ అయినట్లు అధికారులు గుర్తించినట్టు సమాచారం. వీటికి తోడు విజయవాడలో ఒక కార్ షోరూంలో వాటా, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరులో ఫ్లాట్లు, పలు జిల్లాల్లో ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## మైకులు బంద్ చేయుండ్రి!

**ప్రార్థనా మందిరాల మైకులపై రఘురామ సీరియస్**

**ఫిర్యాదు చేయాలని ప్రజలకు కీలక సూచన**

విజయవాడ, మే 28 (ఈవార్తలు): ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ప్రార్థనా మందిరాల వద్ద లౌడ్‌స్పీకర్ల వల్ల కలిగే శబ్ద కాలుష్యంపై తన పోరాటాన్ని ఉధృతం చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా ప్రార్థనా మందిరాల వద్ద మైకుల మోత ఎక్కువగా ఉంటే, వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఫిర్యాదు ఎలా చేయాలో వివరిస్తూ ఒక నమూనా ఫారమ్‌ను కూడా విడుదల చేశారు. ఫిర్యాదు చేసిన 10 రోజులలోపు పోలీసులు చర్యలు తీసుకోకపోతే, ఆ ఫిర్యాదు కాపీతో పాటు సంబంధిత ఎస్సై పేరు, ఫోన్ నంబర్‌తో తనకు మెయిల్ చేయాలని రఘురామ సూచించారు. గతంలో ప్రజా దర్బార్‌లో చర్చిలు, కొన్ని దేవాలయాల్లోని మైకుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని రఘురామ గుర్తుచేశారు. ఈ క్రమంలోనే తాను ఈ నెల 11న డీజీపీకి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు లేఖ రాశానని తెలిపారు. చట్ట ప్రకారం పరిమిత డెసిబుల్స్‌లో మైకులు వాడాల్సి ఉండగా, చాలాచోట్ల నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని అన్నారు. కొంతమంది ఎలాంటి అనుమతులు లేకుండా జనావాసాల మధ్య చర్చిలు, ఆలయాలు నిర్మిస్తున్నారని రఘురామ ఆరోపించారు. కొత్తగా ప్రార్థనా మందిరాలు నిర్మించాలంటే పంచాయతీ తీర్మానంతో పాటు జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు.

## మూడ్రోజులు ఏపీకి వర్ష సూచన

విశాఖపట్నం, మే 28 (ఈవార్తలు): ఎండలతో అల్లాడుతున్న ఏపీ వాసులకు వాతావరణ శాఖ చల్లటి కబురు అందించింది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితిలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని... వర్షాలు కురిసేందుకు అవసరమైన అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వెల్లడించింది. రుతుపవనాలు కూడా క్రమంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొంది. దీనికి తోడు ఉపరితల ఆవర్తనాలు, ఉత్తర-దక్షిణ ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు వర్షాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపింది. ఉత్తర కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

## ప్రపంచానికే తలమానికంగా 'ఫ్యూచర్ సిటీ'

**గ్లోబల్ సిటీ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం**

**మంత్రులు దుద్దిళ్ల, పొంగులేటి వెల్లడి**



హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): ప్రపంచానికే తలమానికంగా ఉండేలా "ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్ రెడ్డి, డి .శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం నాడు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రతిష్టాత్మక "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు గారు మాట్లాడుతూ... గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టును ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ ప్రారంభోత్సవాన్నికి సంబంధించిన తేదీల పై గౌరవ ముఖ్యమంత్రితో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో తీసుకునే ప్రతి నిర్ణయం, ప్రతి నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం వేస్తున్న పునాదులు రాబోయే తరాలకు ఆధునిక తెలంగాణ నిర్మాణానికి నాంది పలుకుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే నగరంగా ఫ్యూచర్ సిటీ ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని, గ్లోబల్ ప్రెజెన్స్ కలిగిన అనేక ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఇక్కడి నుంచే నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంతో "యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ" ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగవంతంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎదురైన అనేక సవాళ్లను అధిగమిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ తెలంగాణకే కాకుండా దేశానికే తలమానికంగా నిలిచే ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటోందని, ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగ భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు, రాష్ట్రాలు సైతం ఆలోచించని విధంగా తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్‌లో కొనసాగుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, పనుల పురోగతిని సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకుని నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రులు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె. శశాంక, ఐఏఎస్, మహేశ్వరం డీసీపీకె. నారాయణ రెడ్డి, ఐపీఎస్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ పేరుతో నకిలీలు

**కేటీఆర్‌పై రేవంత్ పరోక్ష ఆరోపణలు**

**కేసీఆర్‌కు ఎన్టీఆర్ రాజకీయ భిక్ష: సీఎం**





హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా.. హైదరాబాద్ అమీర్‌పేటలోని మైత్రివనం సర్కిల్‌లో ఎన్టీఆర్ 23 అడుగుల విగ్రహాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఎన్టీఆర్ చేసిన సేవలను, ఆయన ఆశయాలను గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమందిని రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. అదే సమయంలో దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని తేల్చి చెప్పారు. ఎన్టీఆర్, ఇందిరాగాంధీల స్ఫూర్తితో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పాలన చేస్తోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులైన ఎన్టీఆర్ విగ్రహాన్ని.. ఆయన వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రిగా ఉన్న తాను ఆవిష్కరించడంపై వస్తున్న విమర్శలకు దీటుగా సమాధానం చెప్పారు. తమకు ఇందిరాగాంధీ ఎంత ముఖ్యమో.. ఎన్టీఆర్ కూడా అంతే ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. భారతదేశ చరిత్రను చదవాలన్నా, స్ఫూర్తి పొందాలన్నా ముగ్గురు నేతలను స్మరించుకోవాలని పేర్కొన్న రేవంత్ రెడ్డి ఆ ముగ్గురూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని స్పష్టం చేశారు. వారి కీర్తి ప్రతిష్ఠలను గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని.. అదే సమయంలో భారతదేశాన్ని ప్రపంచం ముందు తలెత్తుకునేలా చేసిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని.. ఆమె భూసంస్కరణలు తీసుకువచ్చి.. పేదలకు ఎంతో లబ్ధి చేకూర్చారను గుర్తు చేశారు. ఇక తెలుగుజాతిలో స్ఫూర్తి నింపిన ఎన్టీఆర్.. బడుగు, బలహీనవర్గాల కోసం ఎన్నో కార్యక్రమాలు తీసుకువచ్చారని తెలిపారు. కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా దేశం గర్వించదగిన నేత ఎన్టీఆర్ అని పేర్కొన్న రేవంత్ రెడ్డి.. అందుకే ఆయన విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున పెట్టినట్లు స్పష్టం చేశారు. ఇది తనకు జీవితకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకమని తెలిపారు. తనపై ఈ విషయంలో ఎవరు ఎలాంటి విమర్శలు చేసినా తాను వెనక్కి తగ్గనని, భయపడనని తేల్చి చెప్పారు. గతంలో తెలంగాణ నుంచి పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, వెంకటస్వామిలాంటి నేతలను ఇందిరాగాంధీ అందించారని పేర్కొన్నారు. తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, కడియం శ్రీహరి, దేవేందర్‌గౌడ్, మోత్కుపల్లి నర్సింహులు వంటి నాయకులను తెలంగాణకు అందించిన వ్యక్తి ఎన్టీఆర్ అని రేవంత్ రెడ్డి తెలిపారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎవరని.. ఎన్టీఆర్ నీడలో బతికిన కేసీఆర్ ఇప్పుడు ఆయనను తక్కువ చేసి మాట్లాడటం సరైందేనా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ లేకుండానే మీరు నాయకులు అయ్యారా అని ప్రశ్నించారు. గ్రామాల్లో పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి ఎన్టీఆర్ పేదలకు విముక్తి కల్పించారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ పేరు పెట్టుకున్న కొందరు నకిలీలు కూడా రాజకీయాల్లో ఉన్నారని రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## చెల్లికి జగన్ బోలెడు ఆస్తి

**ఆ స్థాయిలో ఏ అన్నా ఇవ్వలేదు**

**మాజీమంత్రి రోజా వెల్లడి.. టీడీపీ మహానాడుపై విమర్శలు**

తాడేపల్లి, మే 28 (ఈవార్తలు): తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంపై మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా విమర్శలు గుప్పించారు. మహానాడులో టీడీపీ నేతలు ఉపయోగించిన భాష, వారి బాడీ లాంగ్వేజ్ చూస్తే అసహ్యమేసిందన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాలి గోటికి సరిపోని వారు కూడా మహానాడులో ఇష్టానుసారం మాట్లాడుతున్నారని.. అది సైకిల్ పార్టీ మహానాడా లేక సైకో పార్టీ మహానాడా అంటూ మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కూడా మహానాడు పట్టించుకోలేదని రోజా విమర్శించారు. చంద్రబాబుది మహానాడు కాదు.. దగానాడు అని ప్రజలకు తెలిసిందన్న రోజా.. మహానాడులో జగన్ నామస్మరణే ఎక్కువగా కనిపించిందన్నారు. జగన్ పేరు వింటేనే టీడీపీ నేతల వెన్నులో వణుకు పుడుతోందన్నారు రోజా. రికార్డింగ్ డ్యాన్సులు ఏర్పాటు చేసి మరీ మహానాడు సభలకు జనాల్ని రప్పించే ప్రయత్నం చేసారని విమర్శించారు. మరోవైపు ఏపీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని రోజా ఆరోపించారు. ప్రశ్నించేవారిపై కేసులు పెడుతున్నారని.. దేశంలోని ర్యాంకులలో ఏపీ పోలీసులు చివరి స్థానంలోకి వెళ్లారని విమర్శించారు. మహానాడులో జగన్ గురించి, వైసీపీ గురించి నీచంగా మాట్లాడుతున్నారని.. గొడ్డలి పార్టీ అంటున్నారని మండిపడ్డారు. వెన్నుపోటు, మోసాలతో చంద్రబాబు ముఖ్యమంత్రి స్థాయికి చేరితే.. జగన్ సొంతంగా ఎదిగారన్నారు. జగనన్న చెల్లికి ఇచ్చిన ఆస్తిని.. ప్రపంచంలో ఏ అన్నా, తన చెల్లికి ఇచ్చి ఉండరని రోజా అభిప్రాయపడ్డారు. హెరిటేజ్ ఆస్తులలో చంద్రబాబు తల్లికి, చెల్లికి ఇచ్చిన వాటా ఎంతో చెప్తారా అని ప్రశ్నించారు. వైఎస్ వివేకా హత్య చంద్రబాబు హయాంలో జరిగిందన్న రోజా.. వైఎస్ షర్మిల, సునీత అప్పుడు ఎందుకు మాట్లాడలేదని విమర్శించారు. వివేకా హత్య కేసులో నిందితుడు దస్తగిరికి కొమ్ము కాస్తోది మీరు కాదా అని ప్రశ్నించారు. ఇదే క్రమంలో హోం మంత్రి వంగలపూడి అనితపైనా విమర్శలు గుప్పించారు. సుగాలి ప్రీతి పేరు చెప్పుకుని అధికారంలోకి వచ్చారని.. ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారన్న రోజా.. కూటమి సర్కారు మోసాలను వెన్నుపోటు రెండేళ్లు పేరుతో విడుదల చేసిన బుక్ లెట్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి గడపకూ చేరేలా చూస్తామని స్పష్టం చేశారు.

## ఏడున్నర గంటల పాటు విజయసాయిరెడ్డి విచారణ

హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): ఏపీ మద్యం కుంభకోణం కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డిని ఈడీ సుమారు ఏడున్నర గంటల పాటు విచారించింది. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారులు ఆయనను విచారించారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మద్యం పాలసీ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తాను ఎవరి పేర్లను అధికారులకు చెప్పలేదని వెల్లడించారు. మద్యం కుంభకోణానికి సంబంధించిన విషయాలన్నీ రాజ్ కెసిరెడ్డికి మాత్రమే తెలుసని చెప్పానని వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా గతంలో సీజ్ చేసిన మొబైల్ ఫోన్‌లలోని వివరాలను ఈడీ అధికారులు సేకరించారని తెలిపారు. లోపల ప్రశ్నలు, విచారణలు పెద్దగా ఏమీ జరగలేదని పేర్కొన్నారు. తన ఫోన్‌లోని డేటా ట్రాన్స్ ఫర్ కోసం పిలిచినట్లు చెప్పారు. వారికి అవసరమైన సమాచారం తన ఫోన్‌లో ఉంటుందనే ఉద్దేశంతో ఆ డేటాను తీసుకున్నట్లు చెప్పారు.

# ట్విషా శర్మ అత్త అరెస్టు

భోపాల్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వరకట్న మరణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తన కోడలు ట్విషా శర్మ మృతి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రిటైర్డ్ జిల్లా జడ్జి గిరిబాలా సింగ్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) గురువారం అదుపులోకి తీసుకుంది. మధ్యప్రదేశ్ హైకోర్టు ఆమెకు మంజూరైన ముందస్తు బెయిల్‌ను రద్దు చేసిన మరుసటి రోజే సీబీఐ ఈ చర్యలు చేపట్టింది. భోపాల్‌లోని కటారా హిల్స్ ప్రాంతంలో ఉన్న గిరిబాలా సింగ్ నివాసానికి ఈరోజు ఉదయం భారీ పోలీసు బలగాలతో సీబీఐ అధికారులు చేరుకున్నారు. ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి, ప్రజల రాకపోకలను నియంత్రించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. గిరిబాలా సింగ్ కుమారుడు సమర్థ్ సింగ్‌తో 2025 డిసెంబర్ 9న ట్విషా శర్మకు వివాహం జరిగింది. పెళ్లయిన ఐదు నెలలకే (ఈ నెల 12న) ట్విషా తన అత్తవారింట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ ఘటన తర్వాత గిరిబాలా సింగ్ ముందస్తు బెయిల్ కోసం భోపాల్ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, ఈ నెల 15న ఆమెకు బెయిల్ మంజూరైంది. దీనిపై ట్విషా కుటుంబం హైకోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టిన హైకోర్టు వెకేషన్ బెంచ్, కింది కోర్టు కీలకమైన వాస్తవాలను సరిగ్గా పరిశీలించలేదని వ్యాఖ్యానిస్తూ బెయిల్‌ను రద్దు చేసింది. నిన్న 17 పేజీల తీర్పును వెలువరిస్తూ ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ఆరోపణలు కేవలం భర్త సమర్థ్ సింగ్‌కు మాత్రమే పరిమితం కావని హైకోర్టు స్పష్టం చేసింది. వాట్సాప్ చాట్‌లు, ట్విషా కుటుంబ సభ్యుల వాంగ్మూలాలను బట్టి గిరిబాలా సింగ్ పాత్ర కూడా ఉన్నట్టు తెలుస్తోందని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. గిరిబాలా, ఆమె కొడుకు ట్విషాను గర్భస్రావం చేయించుకోవాలని ఒత్తిడి చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది.

# 4 రాష్ట్రాలకు కొత్త కమలనాథులు

న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధిష్ఠానం పలు రాష్ట్రాల్లో పార్టీ నాయకత్వంలో కీలక మార్పులు చేసింది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, త్రిపుర రాష్ట్రాలకు కొత్త పార్టీ అధ్యక్షులను నియమిస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ కార్యదర్శి అరుణ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. తాజా మార్పుల ప్రకారం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రిగా ఉన్న హర్ష్ మల్హోత్రాకు ఢిల్లీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. వీరేంద్ర సచ్‌దేవా స్థానంలో ఆయన ఈ పదవిని చేపట్టనున్నారు. హర్యానా బీజేపీ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ అర్చనా గుప్తాను, పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సర్దార్ కేవల్ సింగ్ ధిల్లాన్‌ను, త్రిపుర సారథిగా డాక్టర్ అభిషేక్ దేబ్రాయ్‌ను నియమించారు. నితిన్ నబిన్ బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీలో జరిగిన తొలి పెద్ద పునర్వ్యవస్థీకరణ ఇదే కావడం గమనార్హం. ఈ నియామకాల్లో పంజాబ్ అధ్యక్షుడి ఎంపికకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మార్పు కీలకంగా మారింది. ప్రస్తుతం ఆప్ పాలనలో ఉన్న పంజాబ్‌లో కాంగ్రెస్ నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ రాజకీయ అవకాశాన్ని అందిపుచ్చుకుని కీలక శక్తిగా ఎదగాలని బీజేపీ భావిస్తోంది. ఈ కొత్త అధ్యక్షులు త్వరలోనే పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఇతర కేంద్ర నాయకులతో సమావేశం కానున్నారు. వీరి నేతృత్వంలో రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో కొత్త కార్యవర్గాల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది.

# కెనడాలో భారత యువతి దారుణ హత్య

ఒట్టావా: కెనడాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న మరో భారతీయ విద్యార్థిని దారుణ హత్యకు గురయ్యారు. గుజరాత్‌కు చెందిన 22 ఏళ్ల యువతిపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేసి ప్రాణాలు తీశాడు. ఈ విషాద ఘటన కెనడాలోని నయాగరా ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలిని గుజరాత్‌లోని ఆనంద్ జిల్లా బోర్సాద్ పట్టణానికి చెందిన విధి కల్పేష్‌భాయ్ మేఘానిగా గుర్తించారు. ఆమె గత నాలుగేళ్లుగా కెనడాలో నివసిస్తున్నారు. చదువుకుంటూనే ఖర్చుల కోసం పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నారు. ఈ నెల 15న ఈ దారుణం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే, హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై కెనడా పోలీసులు హత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన తమ కుమార్తె విగతజీవిగా మారిందన్న వార్త తెలియడంతో విధి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# అగ్నిప్రమాదంలో 16 మంది అమ్మాయిలు సజీవ దహనం

న్యూఢిల్లీ: కెన్యా రాజధాని నైరోబికి వాయవ్య దిశలో సుమారు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిల్గిల్ ప్రాంతంలోని ఓ బోర్డింగ్ స్కూల్లో అగ్నిప్రమాదం సంభవించి 16 మంది విద్యార్థినులు మృతి చెందారు. అంతేగాక, పదుల సంఖ్యలో విద్యార్థినులు గాయపడగా, వారిని ఆసుపత్రులకు తరలించారు. వారిలో 71 మందికి చికిత్స అందించి డిశ్చార్జ్ చేయగా, మరో ఏడుగురికి ఇంకా చికిత్స అందుతోంది. అగ్నిప్రమాదం ఎలా జరిగిందో ఇంకా తేలలేదని, దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు చెప్పారు. ఉటుమిషి గర్ల్స్ అకాడమీలో గురువారం తెల్లవారుజామున విద్యార్థినులు నిద్రలో ఉన్న సమయంలో మంటలు చెలరేగాయి. తమ పిల్లల గురించి సమాచారం తెలుసుకునేందుకు ఆందోళనతో తల్లిదండ్రులు, బంధువులు ఘటనాస్థలికి చేరుకున్నారు. దీనిపై కెన్యా విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ.. వసతి గృహంలోని మొదటి అంతస్తులో మంటలు చెలరేగి, ఆ భాగం పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. అగ్నిమాపక బృందాలు మంటలను అదుపులోకి తీసుకొచ్చాయని, కానీ అప్పటికే భారీ నష్టం జరిగిపోయిందని చెప్పారు. మృతుల కుటుంబాలకు అంతర్గత వ్యవహారాల మంత్రి కిప్చుంబా సంతాపం తెలిపారు. "ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇప్పటివరకు 16 మంది మరణించినట్లు గుర్తించాం. కెన్యా ప్రజలు అందరూ ఆ కుటుంబాలకు ప్రార్థనలతో, మద్దతుతో అండగా నిలవాలి" అని అన్నారు. ప్రజలు సహనం పాటించాలని, వదంతులను నమ్మొద్దని చెప్పారు. కెన్యాలోని వసతి పాఠశాలల్లో అగ్నిప్రమాదాలు కొత్త విషయం కాదు. గత కొన్ని సంవత్సరాల్లో అనేక ప్రాణాంతక ఘటనలు చోటుచేసుకున్నాయి.

# అణ్వస్త్రాలను విడవం: కిమ్

ప్యాంగ్యాంగ్: క్వాడ్ దేశాలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనను ఉత్తర కొరియా గురువారం ఖండించింది. సంపూర్ణ అణు నిరాయుధీకరణ చేపట్టాలని క్వాడ్ దేశాలు ఆ ప్రకటనలో కోరగా తమ అణ్వస్త్ర కార్యక్రమాన్ని ఎప్పటికీ విడిచిపెట్టబోమని ఉత్తర కొరియా స్పష్టం చేసింది. దక్షిణ కొరియా వార్తా సంస్థ యోన్హాప్ ఈ విషయాన్ని వెల్లడించింది. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాల 'క్వాడ్' కూటమి ఇటీవల సమావేశం జరిపిన విషయం తెలిసిందే. భారత్, ఆస్ట్రేలియా, జపాన్ విదేశాంగ మంత్రులు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో కలిసి ఇటీవల న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా ఉత్తర కొరియా సంపూర్ణ అణు నిరాయుధీకరణపై తమ వైఖరిని మరోసారి ప్రకటించారు. దీనికి ప్రతిస్పందనగా ఉత్తర కొరియా విదేశాంగ శాఖ.. క్వాడ్ ప్యాంగ్యాంగ్ సార్వభౌమ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని ఆరోపించింది. అలాగే, ఈ తీరు "అమెరికా ఏకపక్ష ఆధిపత్య లక్ష్యాల సాధనకు ఉపయోగపడే రాజకీయ, దౌత్య సాధనం మాత్రమే" అని విమర్శించింది. "డీపీఆర్‌కే(డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా) అణు నిరాయుధీకరణ ఎప్పటికీ చేయదని మేము మరోసారి చెబుతున్నాం" అని ఆ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు. అమెరికా నేతృత్వంలోని క్వాడ్ తమ దేశంపై తీసుకున్న వైఖరిని పూర్తిగా తిరస్కరిస్తున్నామని ఉత్తరకొరియా తెలిపింది. ప్రాంతీయ శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీసే ఘర్షణాత్మక చర్యలను నిలిపివేయాలని క్వాడ్ కూటమిని గట్టిగా కోరింది.

# కోల్ ఇండియాలో మస్తు గిరాకీ

## కేంద్రం వాటా విక్రయం.. ఎగబడ్డ ఇన్వెస్టర్లు.. అమ్మకానికి మరో 6 కోట్ల షేర్లు



న్యూఢిల్లీ: కోల్ ఇండియా ఆఫర్ ఫర్ సేల్‌కు తొలిరోజే అదిరిపోయే రెస్పాన్స్ లభించింది. కేంద్రం కొంత కాలంగా ప్రభుత్వ సంస్థల్లో వాటాల్ని విక్రయిస్తుండగా.. ఇప్పుడు కోల్ ఇండియా వంతు వచ్చింది. 2 శాతం వాటా విక్రయానికి నిర్ణయించి ముందుగా ఒక శాతం వాటాను విక్రయానికి ఉంచింది. మంచి రెస్పాన్స్ ఉంటే.. మిగతా ఒక శాతం వాటాను గ్రీన్ షూ లేదా ఓవర్ సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ కింద ఉంచి విక్రయించేందుకు కేంద్రం నిర్ణయించింది. ఇక ఆఫర్ ఫర్ సేల్ మే 27న నాన్ రిటైల్ ఇన్వెస్టర్ల కోసం జరగ్గా.. ఇక్కడ వారి కోసం ఒక శాతం వాటాకు సమానమైన 6.16 కోట్ల షేర్లను అందుబాటులో ఉంచారు. అయితే ఇక్కడ ఊహించని రీతిలో రెస్పాన్స్ లభించింది. కొద్ది రోజుల కిందట సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓఎఫ్ఎస్ కంటే అధిక గిరాకీ కనిపించింది. రిజర్వ్ చేసిన షేర్లకు మించి 8 రెట్లకుపైగా స్పందన లభించడం విశేషం. అంటే 6.16 కోట్ల షేర్లు అందుబాటులో ఉండగా.. రికార్డు స్థాయిలో 45.15 కోట్ల షేర్లకు నాన్ రిటైల్ ఇన్వెస్టర్లు/సంస్థాగత మదుపరులు బిడ్స్ దాఖలు చేయడం గమనార్హం. ఇక్కడ ఒక శాతం వాటాకు ఒక్కో ఈక్విటీ షేరుకు ధరను రూ. 412 గా నిర్ణయించగా.. ఈ లెక్కన కేంద్రం రూ. 2500 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 45.15 కోట్ల షేర్లకు బిడ్స్ దాఖలు కావడంతో ఈ విలువ దాదాపు రూ. 19 వేల కోట్లకుపైనే ఉంది. అంటే.. 8 రెట్లకుపైగా విలువ కూడా జమైందన్నమాట. తొలిరోజు మంచి స్పందన లభించిన నేపథ్యంలో ఇప్పుడు ఓవర్ సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ కూడా ఉపయోగించనుంది. అంటే మరో ఒక శాతం వాటాను విక్రయించనుంది. అంటే మరో 6.16 కోట్ల షేర్ల విక్రయం జరగనుంది. ఇప్పటికే మే 27న నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు ఓఎఫ్ఎస్ జరగ్గా.. మే 29న రిటైల్ ఇన్వెస్టర్లు, అర్హులైన ఉద్యోగులకు వాటా విక్రయం నిర్వహించనున్న సంగతి తెలిసిందే. దీంతో ఇప్పుడు ఓవర్ సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ లేదా గ్రీన్ షూ ఆప్షన్ కూడా ఉండగా.. బిడ్స్ రాని నాన్ రిటైల్ ఇన్వెస్టర్లు మళ్లీ పార్టిసిపేట్ చేయొచ్చు. ఇందులోనే రిటైల్ ఇన్వెస్టర్లు, అర్హులైన కోల్ ఇండియా ఉద్యోగులు కూడా బిడ్స్ దాఖలు చేస్తారు. మొత్తం ఆఫర్ సైజ్‌లో మే 29న రిటైల్ ఇన్వెస్టర్లకు 1.23 కోట్ల షేర్లను రిజర్వ్ చేశారు. 25 వేల షేర్లు అర్హులైన ఉద్యోగులకు అందుబాటులో ఉంటాయి. ఇక కోల్ ఇండియా షేరు విషయానికి వస్తే మే 27 రూ. 463.60 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ. 2.85 లక్షల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 491.25 గా ఉండగా.. కనిష్ఠ ధర రూ. 368.65 గా ఉంది. 6 నెలల్లో ఈ స్టాక్ ధర 23 శాతానికిపైగా పెరిగింది. ఏడాదిలో 16 శాతం, ఐదేళ్లలో 215 శాతం పుంజుకుంది.

# పిడుగుపడి టెకీ దుర్మరణం

మైసూరు: కర్ణాటకలోని మైసూరులో విషాదం చోటుచేసుకుంది. ఎన్నో కలలు, ఆశయాలతో ఐటీ కొలువు వదిలి.. వ్యవసాయం బాటపట్టిన ఓ టెకీ, అనుకోకుండా ప్రాణాలు కోల్పోయారు. మడికేరి టౌన్ ప్రాంతానికి చెందిన రోషన్ బాలకృష్ణకు 43 ఏళ్లు. ఇన్నేళ్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన ఆయన మనసు.. సేద్యం వైపు మళ్లింది. దీంతో ఇటీవలే ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయ రంగంలోకి అడుగుపెట్టారు. ఒక స్నేహితుడితో కలిసి వ్యవసాయ రంగంలో పనిచేయడం ప్రారంభించారు. ఇంటి నుంచే వ్యాపార కార్యకలాపాలను నిర్వహించేవారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలను పరిచయం చేయడం, వాటిని మార్కెటింగ్ చేయడం వంటి పనులు ప్రారంభించారు. ఇక తన వ్యవసాయ కార్యకలాపాలను విస్తరించుకునే ప్రయత్నాలలో భాగంగా రోషన్ బాలకృష్ణ స్థలం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం భూమిని పరిశీలించేందుకు మైసూరుకు వెళ్లారు. వ్యవసాయ భూమిని చూసేందుకు తన భార్య, కుమారుణ్ని కూడా వెంట తీసుకెళ్లారు. ఆ వ్యవసాయ భూమి సమీపంలో ఒక మామిడి చెట్టు ఉంది. ఈ చెట్టు నుంచి మామిడి పండ్లు కోయడానికి రోషన్ ఆగిన సమయంలో, అకస్మాత్తుగా అతనిపై పిడుగు పడినట్లు తెలిసింది. దీంతో రోషన్ బాలకృష్ణ కుప్పకూలి, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అలాగే అక్కడ ఉన్న మరో వ్యక్తికి కూడా పిడుగుపాటుకు గాయాలయ్యాయి. పిడుగుపాటుతో ప్రాణాలు కోల్పోయిన రోషన్ బాలకృష్ణ కుటుంబానికి మైసూరు జిల్లా విపత్తు నిర్వహణ విభాగం పరిహారం ప్రకటించింది. రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి నుంచి నాలుగు లక్షలు, జాతీయ విపత్తు నిర్వహణ నిధి నుంచి రూ.లక్ష కలిపి.. మొత్తంగా రూ.5 లక్షలు పరిహారం ప్రకటించింది. అనుకోకుండా జరిగిన ప్రమాదంలో ఎన్నో ఆశయాలతో వ్యవసాయం వైపు అడుగులు వేసిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రాణాలు కోల్పోవటం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఇదే సమయంలో వర్షాకాలలో వ్యవసాయ క్షేత్రాలలో పిడుగుపాటు ఎంత ప్రమాదకరంగా మారుతుందో.. ఈ ఘటన ద్వారా మరోసారి తెలిసివచ్చింది. ఈ నేపథ్యంలో వర్షం కురుస్తున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే సమయంలో చెట్ల కింద ఉండొద్దని హెచ్చరిస్తున్నారు.



# సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీలు

**కేంద్రానికి కొలీజియం సిఫార్సు**

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదుగురు న్యాయమూర్తుల నియామకానికి రంగం సిద్ధం అయింది. సర్వోన్నత న్యాయస్థానంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి సుప్రీంకోర్టు కొలీజియం కసరత్తు చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం, నలుగురు సీనియర్ హైకోర్టు న్యాయమూర్తులను, ఒక సీనియర్ న్యాయవాదిని సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ జాబితాలో పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు, బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీచంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్ దేవ, జమ్మూ కశ్మీర్ లడఖ్ సీజే జస్టిస్ అరుణ్ పల్లి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వి. మోహన ఉన్నారు. సుప్రీంకోర్టులో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, న్యాయ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈ నియామకాలు అత్యంత కీలకమని కొలీజియం తన సిఫార్సులో పేర్కొంది. కొలీజియం పంపిన ఈ జాబితాను కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ పరిశీలించి, కేబినెట్ ఆమోదం కోసం పంపుతుంది. కేంద్ర కేబినెట్ ఆమోదం అనంతరం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేయగానే ఈ నియామకాలు ఖరారవుతాయి. ఆ తర్వాత నూతన న్యాయమూర్తులుగా వీరు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ నియామకాలతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెరిగి, కార్యకలాపాలు మరింత చురుగ్గా సాగే అవకాశం ఉంది.

# చమురు సంస్థలకు రోజుకు 550 కోట్ల నష్టం

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశీయంగా సామాన్యులపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు (పీఎస్‌యూలు) పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ అమ్మకాలపై రోజుకు సుమారు రూ.550 కోట్ల నష్టాన్ని భరిస్తున్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ధరలు పెరిగాయి. అయినప్పటికీ, ఆ పెరిగిన ధరలను దేశీయ రిటైల్ మార్కెట్‌కు బదిలీ చేయకుండా వినియోగదారులకు ఉపశమనం కల్పిస్తున్నారు. ఈ ప్రయోజనం కేవలం సాధారణ గృహాలు, ద్విచక్ర వాహనదారులు, రైతుల వంటి రిటైల్ వినియోగదారులకు మాత్రమేనని, పారిశ్రామిక కొనుగోళ్లకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, ఈ ధరల వ్యత్యాసం వల్ల కొత్త సమస్య తలెత్తింది. పారిశ్రామిక అవసరాల కోసం పెద్ద మొత్తంలో ఇంధనం కొనుగోలు చేసేవారు కూడా తక్కువ ధరకు లభించే రిటైల్ బంకులకు వస్తున్నారు. దీనివల్ల ప్రైవేట్ సంస్థల డీజిల్ అమ్మకాలు 38 శాతం పడిపోగా, ఆ భారం ప్రభుత్వ రంగ బంకులపై పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇది స్థానిక కొరతకు దారితీసే ప్రమాదం ఉందని మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన కేంద్రం, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది. 'అత్యవసర వస్తువుల చట్టం' కింద చర్యలు చేపట్టాలని, ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని సూచించింది. సామాన్యుల కోసం ఉద్దేశించిన ఇంధనాన్ని పారిశ్రామిక అవసరాలకు మళ్లించవద్దని పరిశ్రమల సంఘాలకు కూడా హెచ్చరికలు జారీ చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలకు ఎలాంటి కొరత లేదని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ భరోసా ఇచ్చింది. దేశీయ అవసరాలు తీరగా, భారత్ పెట్రోలియం ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఎగుమతి కూడా చేస్తోందని గుర్తు చేసింది. దేశంలో సప్లై సమస్య లేదని, ధరల వ్యత్యాసం వల్ల కొరత ఏర్పడుతోందన్న పుకార్లను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.

# టాటా టియాగో ఫేస్ లిఫ్ట్.. 4.69 లక్షలే!

**అన్ని ఎలక్ట్రిక్ కార్లపై లైఫ్‌టైమ్ వారంటీ ప్రకటన**

న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ మార్కెట్లో తీవ్రమైన పోటీ నెలకొన్న హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు టాటా మోటార్స్ కీలక అడుగు వేసింది. చాలాకాలం తర్వాత తన ఎంట్రీ-లెవల్ హ్యాచ్‌బ్యాక్ టియాగోకు భారీ అప్‌డేట్లను అందిస్తూ, 2026 టాటా టియాగో ఫేస్‌లిఫ్ట్, టియాగో ఈవీ మోడళ్లను గురువారం మార్కెట్లోకి విడుదల చేసింది. ఆకర్షణీయమైన డిజైన్ మార్పులు, సరికొత్త ఫీచర్లతో పాటు సంచలన ధరలను ప్రకటించి వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. మారుతి సుజుకి స్విఫ్ట్, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ వంటి బలమైన పోటీదారులకు గట్టి సవాలు విసిరేలా ఈ కొత్త మోడళ్లను తీర్చిదిద్దారు. ఈ లాంచ్ ఈవెంట్‌లో టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ఒక సంచలనాత్మక ప్రకటన చేసింది. ఇకపై తమ అన్ని ఎలక్ట్రిక్ వాహనాలపై జీవితకాల, అపరిమిత కిలోమీటర్ల వారంటీని అందిస్తున్నట్లు ప్రకటించింది. టియాగో ఈవీతో పాటు పంచ్ ఈవీ, హ్యారియర్ ఈవీ, కర్వ్ ఈవీ, టిగోర్ ఈవీ వంటి అన్ని టాటా ఎలక్ట్రిక్ కార్లకు ఈ వారంటీ వర్తిస్తుంది. ఇది పరిశ్రమలోనే ఒక విప్లవాత్మక నిర్ణయంగా భావిస్తున్నారు.

**అన్ని వేరియంట్ల ధరల వివరాలు**

**టాటా మోటార్స్ ఈ కొత్త మోడళ్లను పెట్రోల్, ఈవీ, సీఎన్‌జీ వేరియంట్లలో అందుబాటులోకి తెచ్చింది.**

**టాటా టియాగో (పెట్రోల్): దీని ప్రారంభ ధరను రూ. 4.69 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) నిర్ణయించారు.**

**టాటా టియాగో ఈవీ: ఎలక్ట్రిక్ వేరియంట్ ప్రారంభ ధర రూ. 6.99 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) ఉంది.**

**టియాగో ఈవీ: బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ పద్ధతిలో కారును రూ. 4.69 లక్షలకు కొనుగోలు చేసి, కిలోమీటరుకు రూ. 2.6 చొప్పున చెల్లించే సౌకర్యాన్ని కూడా కల్పించారు.**

**టాటా టియాగో ఐసీఎన్‌జీ: సీఎన్‌జీ వేరియంట్ ప్రారంభ ధర రూ. 5.79 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) ఉంది.**

# పినరయి విజయన్ నివాసంలో ఈడీ సోదాలు

తిరువనంతపురం: కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంలో ఈడీ అధికారులు నిన్న సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ దాడులపై ఏపీ సీపీఐ నేత రామకృష్ణ తీవ్రంగా స్పందించారు. దాడులను ఖండించిన ఆయన... సోదాలు నిర్వహించిన అధికారులు ఒట్టి చేతులతోనే వెనక్కి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు కేరళ ముఖ్యమంత్రిగా ఉన్న విజయన్ కు ప్రజల్లో మంచి ఇమేజ్ ఉందని... ఆ ఇమేజ్ డ్యామేజ్ చేసేందుకే ఈడీ దాడులు జరిగాయని రామకృష్ణ విమర్శించారు. మోదీ ప్రధాని అయినప్పటి నుంచి ప్రతిపక్ష నేతలపై ఈడీ దాడులు, అక్రమ కేసులు సాధారణమై పోయాయని దుయ్యబట్టారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ శిసోడియా విషయంలో కూడా ఇదే జరిగిందని రామకృష్ణ అన్నారు. బీజేపీ కండువా కప్పుకునే వారు ఎవరైనా సరే వారిపై ఎలాంటి దాడులు జరగవని చెప్పారు. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ, బెంగాల్ సీఎం సువేందు అధికారిపై కూడా గతంలో మోదీ ఆరోపణలు చేశారని... అయితే, వారు బీజేపీలో చేరడంతో వాళ్లపై ఎలాంటి చర్యలు లేవని మండిపడ్డారు. కేవలం ప్రతిపక్ష నేతలపై మాత్రమే ఒక పక్కా ప్లాన్ ప్రకారం దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు.

# మృత్యుశిఖరంగా ఎవరెస్టు

**8,000 మీటర్లు దాటాక 'డెత్ జోన్'**

**ఆక్సిజన్ కొరతతో మెదడు, ఊపిరితిత్తులు విఫలం**

**ఈ సీజన్‌లో మొత్తం ఐదుగురి మృతి**

న్యూఢిల్లీ: అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం చాలామందికి ఒక కల. కానీ ఆ కలను నిజం చేసుకునే ప్రయాణంలో ప్రాణాలకే ముప్పు తెచ్చే ఒక ప్రమాదకరమైన ప్రదేశం ఉంది. అదే 'డెత్ జోన్'. సముద్ర మట్టానికి 8,000 మీటర్ల (26,247 అడుగుల) ఎత్తు దాటిన తర్వాత మొదలయ్యే ఈ ప్రాంతంలో, ప్రాణవాయువు కొరతతో మానవ శరీరం నిమిషనిమిషానికీ క్షీణించడం మొదలవుతుంది. ఈ ఏడాది (2026) సీజన్‌లో ఇద్దరు భారతీయ పర్వతారోహకులతో సహా కనీసం ఐదుగురు ఇక్కడ ప్రాణాలు కోల్పోయారు. డెత్ జోన్‌లో గాలిలో ఆక్సిజన్ స్థాయి సముద్ర మట్టంతో పోలిస్తే కేవలం మూడో వంతు మాత్రమే ఉంటుంది. దీనివల్ల 'హైపోక్సియా' (ఆక్సిజన్ కొరత) ఏర్పడి, మొదట మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో గందరగోళం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం, భ్రాంతులు కలగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సప్లిమెంటరీ ఆక్సిజన్ లేకుండా శిఖరంపైకి చేరితే, కేవలం 4 నిమిషాల్లో స్పృహ కోల్పోయి, 6 నిమిషాల్లో మరణం సంభవిస్తుంది. దీంతోపాటు మెదడు వాపు, ఊపిరితిత్తులలో నీరు చేరడం వంటి ప్రాణాంతక సమస్యలు కూడా తలెత్తుతాయి. శరీరం తనను తానే తినేస్తూ, కండరాలు బలహీనపడతాయి. ఇటీవల కాలంలో ఎవరెస్ట్‌పై రద్దీ విపరీతంగా పెరిగిపోవడం మరణాలకు మరో ప్రధాన కారణంగా మారింది. ఈ సీజన్‌లో నేపాల్ వైపు నుంచి ఒకేరోజు 274 మంది శిఖరాన్ని చేరుకున్నారు. ఈ రద్దీ వల్ల ప్రమాదకరమైన హిల్లరీ స్టెప్ వంటి ప్రాంతాల్లో గంటల తరబడి నిల్చోవాల్సి వస్తోంది. మైనస్ 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ఇలా నిరీక్షించడం వల్ల శరీరం చల్లబడిపోవడమే కాకుండా, వెంట తెచ్చుకున్న ఆక్సిజన్ నిల్వలు కూడా వేగంగా అయిపోతున్నాయి. ఎక్కడం కన్నా దిగడమే అత్యంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శిఖరాన్ని చేరుకునేసరికే శక్తి మొత్తం అయిపోవడంతో, తిరుగు ప్రయాణంలో నీరసం, ఆక్సిజన్ కొరత కారణంగా చాలామంది కుప్పకూలుతున్నారు. ఈ ఏడాది మరణించిన ఇద్దరు భారతీయులు కూడా శిఖరాన్ని అధిరోహించి, కిందకు దిగివస్తుండగా ప్రాణాలు విడిచారు. డెత్ జోన్‌లో వీలైనంత తక్కువ సమయం గడపాలని, వాతావరణం అనుకూలించకపోతే వెనుదిరగాలని నిపుణులు సూచిస్తున్నారు.

# గొర్రెల కాపరి ఉద్యోగానికి 700 మంది దరఖాస్తు

బీజింగ్: మంగోలియాకు దక్షిణాన ఉన్న మారుమూల, కఠినమైన గడ్డి మైదానాలలో పనిచేయడానికి గొర్రెల కాపరుల కోసం తాను ఇచ్చిన ఉద్యోగ ప్రకటన సామాజిక మాధ్యమాలలో ట్రెండింగ్ కావడం చూసి చైనాకు చెందిన వ్యవసాయ క్షేత్ర యజమాని జువో జియావోయాంగ్ ఆశ్చర్యపోయాడు. మంగోలియా సరిహద్దు ప్రాంతంలో గొర్రెలు కాయడానికి ఇద్దరు వ్యక్తులు కావాలని అతను చిన్న ప్రకటన ఇచ్చాడు. ఈ పోస్టు కొన్ని గంటల్లోనే 'వీబో'లో 5.9 కోట్ల వ్యూస్‌తో ట్రెండింగ్‌లో మొదటిస్థానంలోకి వచ్చింది. రెండు పోస్టుల కోసం 700 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. షాంఘై, చోంగ్‌కింగ్ వంటి నగరాలలోని వైట్ కాలర్ ఉద్యోగులతో పాటు చైనాలోని వివిధ ఫ్యాక్టరీల కార్మికులు, విశ్వవిద్యాలయ పట్టభద్రులు కూడా దరఖాస్తు చేసుకున్నవారిలో ఉన్నారు. అయితే ఈ ఉద్యోగానికి ప్రకటించిన వేతనం రూ.1 లక్షా 10 వేల రూపాయలు. చైనా ప్రైవేటు కంపెనీల యావరేజ్ శాలరీ సుమారు రూ.70 వేల కంటే ఇది చాలా ఎక్కువ. ఈ గొర్రెల కాపరికి పెద్ద మొత్తంలో వేతనంతో పాటు ఉచిత వసతి, ఉచిత గ్రాసరీ అందజేస్తారు. ఇది చైనా జాబ్ మార్కెట్‌లోని క్లిష్ట పరిస్థితులకు నిదర్శనమని చెబుతున్నారు. తన ఈ ప్రకటన ఇంత వైరల్ అవుతుందనుకోలేదని జువో అన్నాడు. దరఖాస్తు చేసుకున్న వారిలో పదోవంతు మంది అప్పుడే విశ్వవిద్యాలయ విద్యను పూర్తి చేసినవారు ఉన్నట్లు చెప్పారు. మరికొందరు అప్పుల్లో కూరుకుపోయినవారు ఉన్నారని పేర్కొన్నారు. అయితే ఈ ఉద్యోగం చేయడం అనుకున్నంత సులభం కాదు. వేసవిలో 4 వేల 900 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల గొర్రెలను మేపాల్సి ఉంటుంది. శీతాకాలంలో మైనస్ 30 డిగ్రీల చలిలో వాటిని క్లీన్ చేస్తూ అక్కడే ఉండాలి. చలి తట్టుకోలేని విధంగా ఉంటుంది. ఏడాది పొడవునా మనుషులు కనిపించని ఒంటరితనం భరించాలి. ఇవన్నీ జువో ముందుగానే ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నాడు. అందుకే జువో వైట్ కాలర్ ఉద్యోగులను, నగర యువతను కాకుండా, గతంలో ఫార్మింగ్‌లో అనుభవం ఉండి, ఒంటరితనాన్ని తట్టుకోగల 1980లలో పుట్టిన రెండు జంటలను (మొత్తం నలుగురిని) ఎంపిక చేశాడు.

# తెలంగాణ అనే పదం లేదనడం దురదృష్టకరం

**బక్కని నర్సింహులు క్షమాపణ చెప్పాలి: దావ వసంత**



జగిత్యాల టౌన్, మే 28 (ఈవార్తలు): మహానాడులో టీడీపీ నాయకుడు బక్కని నర్సింహులు చేసిన "డిక్షనరీలో తెలంగాణ అనే పదం లేదు" అన్న వ్యాఖ్యలను జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ తీవ్రంగా ఖండించారు. తెలంగాణ మట్టిలో పుట్టి పెరిగిన వ్యక్తి తెలంగాణ వ్యతిరేకి చంద్రబాబు మెప్పుకోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని ఆమె అన్నారు. ఇది కేవలం అజ్ఞానం మాత్రమే కాకుండా తెలంగాణ ఆత్మగౌరవాన్ని, తెలంగాణ చరిత్రను, ఉద్యమాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమం, అమరుల ఆత్మబలిదానాల ఫలితంగానే 2014లో పార్లమెంట్ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. చంద్రబాబు మెప్పుకోసం మాట్లాడిన వ్యాఖ్యలకు బక్కని నర్సింహులు వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే చరిత్రలో తెలంగాణ ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు.

## బావిలో పడి బాలుడు మృతి

బుగ్గారం, మే 28 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన ఒర్సు శివకుమార్(11) గురువారం వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గొర్లు కాస్తున్న సమయంలో బాలుడు కనిపించకపోవడంతో గ్రామ శివారులోని బావి వద్ద వెతికారు. బావిలో బాలుడి చెప్పులు కనిపించగా గ్రామస్థులు గాలింపు చేపట్టి బాలుడిని బయటకు తీశారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిసింది. ప్రమాదవశాత్తు బావిలో పడి మునిగిపోయినట్లు సమాచారం. అయితే తన కుమారుడి మృతిపై పరుమాల మహేష్‌పై అనుమానం ఉందని బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి. సతీష్ తెలిపారు.



## మసీదులు, ఈద్గాల అభివృద్ధికి 7 కోట్లు: అడ్లూరి

ధర్మపురి, మే 28 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ధర్మపురిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ముస్లింల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 10వ తరగతి, ఇంటర్ పూర్తి చేసిన యువతి, యువకులకు బ్యాంకుల ద్వారా రూ.2 లక్షల వరకు రుణాలు అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన యువత ఈ అవకాశాలను వినియోగించుకుని స్వయం ఉపాధి సాధించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## గోవుకు జాతీయ జంతువు హోదా కల్పించాలి

**ప్రధాని మోదీకి జగిత్యాల ముస్లిం కమిటీ విజ్ఞప్తి**

జగిత్యాల, మే 28 (ఈవార్తలు): బక్రీద్ పర్వదినం సందర్భంగా జగిత్యాల ముస్లిం సోదరులు వినూత్న సందేశాన్ని ఇచ్చారు. దేశంలో గోవుకు ఉన్న విశిష్ట స్థానం, భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలకు గౌరవ సూచకంగా ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జగిత్యాల ఈద్గా వద్ద నిర్వహించిన బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం జగిత్యాల ముస్లిం కమిటీ అధ్యక్షుడు బారీ మాట్లాడుతూ దేశంలో అన్ని మతాల విశ్వాసాలను పరస్పరం గౌరవించుకోవడం భారతీయ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. గోవు హిందూ సమాజంలో పవిత్ర స్థానాన్ని పొందిందని, దేశ ఐక్యత, సామరస్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఆవును జాతీయ జంతువుగా గుర్తించాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ముస్లిం సమాజం ఎల్లప్పుడూ దేశ శాంతి, సామరస్యాలకు కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. బక్రీద్ పండుగ త్యాగానికి, మానవత్వానికి ప్రతీక అని, పరస్పర గౌరవ భావనతో అన్ని మతాల ప్రజలు కలిసి జీవించాలనే సందేశాన్ని ఈ పండుగ ఇస్తుందని వివరించారు. ఉదయం నుంచే ఈద్గా, మసీదులకు భారీ సంఖ్యలో చేరుకున్న ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరిగాయి.

## కేసీఆర్ పాలనలోనే బాగుండే!

**జగిత్యాలలో బక్రీద్ వేడుకలపై చర్చ**

**రూ.8 లక్షలు కేటాయించినావసతులు శూన్యం**

జగిత్యాల టౌన్, మే 28 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈద్గా, ఖిలా మైదానాలకు భారీ సంఖ్యలో ముస్లింలు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ వేడుకల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.8 లక్షలు కేటాయించినప్పటికీ, ప్రార్థన కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించలేదని కొంతమంది యువత అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో కూలర్లు, తాగునీటి సదుపాయాలు ఉండేవని, ప్రస్తుతం అవి కనిపించలేదని పేర్కొన్నారు. "కేసీఆర్ హయంలోనే బాగుండేది" అంటూ కొందరు యువకులు వ్యాఖ్యానించారు. వేడుకల సందర్భంగా ఎలాంటి



# ఆర్టీసీ విలీనంపై నిర్ణయం తీసుకోవాలి

**జూన్ 2న ప్రకటన చేసేలా చొరవ తీసుకోవాలి.. ప్రభుత్వానికి టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ విజ్ఞప్తి**

హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): ఆర్టీసీ విలీన ప్రక్రియను వేగవంతం చేసి, జూన్ 2 తేదీన అపాయింటెడ్ డేట్‌ను ప్రభుత్వం ప్రకటించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రాజకీయ ప్రధాన సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి నివాసంలో ఆయనను, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురాంరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో-కన్వీనర్లు బి. యాదగిరి, వి. బాబు, ఎన్. బుద్ధవిశాల్, జి. రవికిరణ్, మహేశ్వరం డిపో డిప్యూటీ సూపరింటెండెంట్(మెకానికల్) ఆర్‌సీఆర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ విలీనంపై జరుగుతున్న పరిణామాలను నాయకులు వారికి వివరించారు. విలీన ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలపై స్పష్టత ఇవ్వడంతో పాటు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు తగిన నిధులను విడుదల చేయాలని కూడా కోరారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. జూన్ 2న అపాయింటెడ్ డేట్ ప్రకటన అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.



అలాగే విలీన విధివిధానాల రూపకల్పన కోసం అధికారులు, కార్మిక సంఘాలతో కమిటీ ఏర్పాటు చేసి, విలీన ప్రక్రియను సక్రమంగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీ ఉద్యోగులకు జరిగిన నష్టం తెలంగాణ ఉద్యోగులకు జరగకుండా కార్మిక సంఘాలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విలీనంతో ఆర్టీసీ కార్మికులకు మేలు జరగాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని, సజావుగా విలీనం జరిగేందుకు తాను కూడా కృషి చేస్తానని వేం నరేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఇక, విలీనంపై ప్రస్తుతం కార్మికుల్లో నెలకొన్న గందరగోళ పరిస్థితులను జేఏసీ నాయకులు వివరించగా, వేం నరేందర్ రెడ్డి విని ఉద్యోగుల మనోభావాలను అర్థం చేసుకుని స్పష్టమైన హామీ ఇవ్వడంపై యావత్ ఆర్టీసీ కార్మికుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎండీ మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



## నేరేళ్ల శ్రవణ్‌కు ఘన నివాళి

మల్యాల, మే 28 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు నేరేళ్ల శ్రవణ్ కుమార్ రెడ్డికి మండల నాయకులు ఘన నివాళి అర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, చొప్పదండి అసెంబ్లీ కన్వీనర్, పెరుక శ్రవణ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, సర్పంచులు సంకుర్తి తిరుపతి, గడ్డం నడిపి మల్లేశం, వకలభరణం మౌర్య, మండల ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ళ గంగరాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు పొన్నగంటి, మహిళా మోర్చా అధ్యక్షురాలు కటకం లత, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, అవుదుర్తి రమ, గుండేటి గంగారాం, రాచర్ల రమేశ్, జనగాం రాములు, జవ్వాజి రాజకుమార్, నక్క ఆనందం, నీలం రవి, సంఘ శంకర్, షేర్ల పరుశురాం, గంగిశెట్టి రాజేశం, బండారి రాజు, జిల్లాల రమేష్, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొని నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పార్టీకి శ్రవణ్ చేసిన సేవలను కొనియాడారు.



## జూన్ 30న రియల్టర్స్ గ్రోత్ కాంక్లేవ్ - 2026

హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): రియల్ ఎస్టేట్ రంగంలో రియల్టర్ల అభివృద్ధి, అవగాహన, వ్యాపార వృద్ధి మరియు నెట్‌వర్కింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో రియల్ వర్సిటీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జూన్ 30న నిర్వహించనున్న "రియల్టర్స్ గ్రోత్ కాంక్లేవ్ -- 2026" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ పోస్టర్‌ను శ్రీ సిద్ధివినాయక ప్రాపర్టీ డెవలపర్స్ సీఎండీ కాసర్ల మహేందర్ రెడ్డి, డైరెక్టర్ రఘుమ రెడ్డి, రియల్ వర్సిటీ ఫౌండర్ ఈ ఉరుకుంద శెట్టి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న రియల్టర్లకు విద్య, వ్యాపారాభివృద్ధి, నాయకత్వ నైపుణ్యాల పెంపొందనకు ఈ కాంక్లేవ్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని తెలిపారు. కాగా, జూన్ 30న జరగనున్న ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ రంగ ప్రముఖులు, నిపుణులు, రియల్టర్లు పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, సాయి విజేందర్, వెంకట్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## వీర సావర్కర్ పోరాట చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

**భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్ రావు**



హైదరాబాద్, మే 28 (ఈవార్తలు): ప్రతి ఒక్కరూ దేశభక్తి, జాతీయ భావాన్ని కలిగి ఉండాలని భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు అన్నారు. వీర సావర్కర్ దేశానికి చేసిన సేవలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు వినాయక్ దామోదర్ వీర్ సావర్కర్ 143వ జయంతిని గురువారం కాచిగూడలో భజరంగ్ సేన ఘనంగా నిర్వ హించింది. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నేత వై. కృష్ణ తో కలిసి సావర్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణ్ రావు మాట్లాడుతూ.. దేశంకోసం వీర సావర్కర్ చేసిన పోరాటం నేడు ప్రతి భారతీయుడు తెలుసుకోవాలన్నారు. ఆంగ్లేయులు విధించిన అతి భయంకరమైన శిక్షను అనుభవించి అండమాన్ జైల్లో క్రూరమైన శిక్షను విధించినా ఏమాత్రం వెరవ కుండా పోరాడిన మహనీయుడని కొనియాడారు. సావర్కర్ పుస్తకాలు, సినిమా చూడాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. వీర సావర్కర్ దేశానికి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. సావర్కర్ పుస్తకాలు,

## సావర్కర్‌కు ఘన నివాళి

జగిత్యాల టౌన్, మే 28 (ఈవార్తలు): స్వాతంత్ర్య సమరయోధుడు, హైందవ సమాజ జాగృతి ప్రదాత, సంఘసంస్కర్త శ్రీ వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతి సందర్భంగా భారత్ సురక్ష సమితి జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మహనీయుడు సావర్కర్ దేశభక్తి, త్యాగస్ఫూర్తి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. దేశభక్తి భావనతో సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు, జనార్ధన్ రెడ్డి, బండి సత్యనారాయణ, నారేందుల శ్రీనివాస్, గండ్ర ప్రవీణ్ రావు, ఒడ్డపెల్లి మురళి, మ్యాన సుధాకర్, రాజేందర్, శిల గంగారాం, కొత్తకుండ బాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ సందర్భగా ప్రత్యేక ప్రార్థనలు

జగిత్యాల, మే 28 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని మండలాల్లో, గ్రామాల్లో శనివారం బక్రీద్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఈద్గా, ఖిలా ఈద్గా, జమా మసీదుల్లో శనివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈద్గాలో ముస్తీ నౌషద్ అలీ ఖాస్మీ, ఖిలా ఈద్గాలో మౌలానా సయ్యద్ అబ్రర్ షరీఫ్, జమా మసీదులో ముఫ్టీ ఖలీల్, లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఖురాన్ పఠించి, బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు అలాయి బలాయి చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్, పలువురు నాయకులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.




వయ్యారి చిత్రం


రోష్ని వాలియా

# జూన్‌లో సినిమాలే సినిమాలు

వచ్చే జూన్ నెల టాలీవుడ్ బాక్సాఫీస్‌కు భారీ వినోదాన్ని అందించేందుకు సిద్ధమవుతోంది. విభిన్న జోనర్లలో తెరకెక్కిన సినిమాలు వరుసగా థియేటర్లలోకి రానుండటంతో సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా స్టార్ హీరోల చిత్రాలు, హారర్ కామెడీలు, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు, స్పోర్ట్స్ డ్రామాలు ఇలా అన్ని రకాల సినిమాలు ఈ నెలలో ప్రేక్షకులను అలరించబోతున్నాయి. జూన్ మొదటి వారంలోనే టాలీవుడ్ బాక్సాఫీస్‌కు భారీ ఊపు రానుంది. జూన్ 3న 'అసురాసుర' సినిమా విడుదల కానుంది. యాక్షన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిన ఈ మూవీపై ప్రేక్షకుల్లో ఆసక్తి కనిపిస్తోంది. ఇక జూన్ 4న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ట్రైలర్, టీజర్లు సోషల్ మీడియాలో భారీ హైప్ క్రియేట్ చేశాయి. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో యాక్షన్, ఎమోషన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. అదే వారంలో జూన్ 5న 'రావ్ బహదూర్' విడుదల కానుంది. అలాగే హాలీవుడ్ ఫాంటసీ యాక్షన్ చిత్రం 'మాస్టర్స్ ఆఫ్ ది యూనివర్స్' కూడా అదే రోజున ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మొదటి వారంలోనే బాక్సాఫీస్ వద్ద మంచి పోటీ కనిపించనుంది. జూన్ రెండో వారం మాత్రం కాస్త నెమ్మదిగా ఉండనుంది. జూన్ 11న 'సంగీతం' అనే సినిమా మాత్రమే విడుదల కానుంది. సంగీతం ప్రధానంగా






తెరకెక్కిన ఈ చిత్రంపై సంగీత ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. అయితే అసలు పోటీ మాత్రం జూన్ మూడో వారంలో కనిపించనుంది. జూన్ 19న ఒకేసారి నాలుగు సినిమాలు థియేటర్లలోకి రాబోతున్నాయి. 'బాలన్ ది బాయ్', 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు', హారర్ కామెడీ మూవీ 'చెట్టు మీద దెయ్యం నాకేం భయం', అలాగే ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' సినిమాలు ఒకేరోజు విడుదల కానున్నాయి. ఈ నాలుగు చిత్రాలు పూర్తిగా భిన్నమైన జోనర్లలో ఉండటంతో ప్రేక్షకులకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజ్ లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా హారర్ కామెడీ సినిమాలకు ఇటీవల మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో 'చెట్టు మీద దెయ్యం నాకేం భయం'పై ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది. జూన్ చివరి వారం మాత్రం బాక్సాఫీస్ వద్ద భారీ హంగామా ఉండనుంది. జూన్ 26న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ' విడుదల కానుంది. ఈ సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి బజ్ నెలకొంది. అదే రోజున స్పోర్ట్స్ డ్రామా 'సూపర్ గోల్' కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రాజకీయ నేపథ్యంతో తెరకెక్కిన ఇంటెన్స్ డ్రామా 'లెనిన్' కూడా జూన్ 26నే విడుదల కానుండటం విశేషం. దీంతో నెలాఖరులో మూడు ప్రధాన చిత్రాలు ఒకేసారి బాక్సాఫీస్ బరిలోకి దిగనున్నాయి. మొత్తం మీద చూస్తే 2026 జూన్ నెల టాలీవుడ్ ప్రేక్షకులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వబోతోందనే చెప్పాలి. భారీ పాన్ ఇండియా సినిమాల నుంచి చిన్న కాన్సెప్ట్ మూవీస్ వరకు అన్ని రకాల చిత్రాలు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇక వీటిలో ఏ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందో చూడాలి.



## ఆహాలో సచిన్ బయోపిక్ స్ట్రీమింగ్

క్రికెట్ దేవుడు, లెజెండ్ సచిన్ టెండూల్కర్ జీవితం ఆధారంగా తెరకెక్కిన బయోపిక్ డాక్యుమెంటరీ 'సచిన్: ఏ బిలియన్ డ్రీమ్స్' ఎట్టకేలకు తెలుగు ఓటీటీ ప్రేక్షకులను పలకరించింది. ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫారమ్ 'ఆహా' ఈ చిత్రానికి సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను విడుదల చేయడంతో పాటు మే 28 నుంచే డిజిటల్ స్ట్రీమింగ్‌ను అధికారికంగా ప్రారంభించింది. తెలుగు వెర్షన్‌తో పాటు మే 29 నుంచి ఈ చిత్రం తమిళంలోనూ అందుబాటులోకి రానుంది. జేమ్స్ ఎర్స్కిన్ దర్శకత్వంలో, రవి భాగ్‌చంద్క, కార్నివాల్ మోషన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహమాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. 2017లో థియేటర్లలో విడుదలై అప్పట్లో మంచి విజయాన్ని అందుకున్న అద్భుత క్రీడా ప్రయాణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించింది. ఇందులో సచిన్ చిన్ననాటి హోమ్ వీడియోలు, ఎక్కడా చూడని అరుదైన మ్యాచ్ ఫుటేజ్‌లతో పాటు ఆయన భార్య అంజలి, సోదరుడు అజిత్ టెండూల్కర్ పంచుకున్న అనేక ఎమోషనల్ విషయాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.

# 'పెద్ది'కి మద్రాస్ హైకోర్టులో భారీ ఊరట

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో రాబోతున్న 'పెద్ది' సినిమా విడుదలకు ముందే చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతున్న ఈ సినిమాపై ఇప్పటికే ట్రైలర్, పాటలతో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ నేపథ్యంలో చిత్ర బృందానికి మద్రాస్ హైకోర్టు ఒక కీలకమైన భారీ ఊరటనిచ్చే తీర్పును వెలువరించింది. సినిమాను పైరసీ భూతం నుండి రక్షించేందుకు కోర్టు అత్యంత ప్రాధాన్యత కలిగిన 'యాంటీ–పైరసీ ఇంజంక్షన్' జారీ చేసింది. సినిమా కాపీరైట్ హక్కులను కాపాడుకోవాలనే ఉద్దేశంతో చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌ను హైకోర్టు వెకేషన్ బెంచ్ సుదీర్ఘంగా విచారించింది. ఒకవేళ సినిమా విడుదలకు ముందో, లేదా విడుదలైన వెంటనేనో ఇంటర్నెట్‌లో అనధికారికంగా లీక్ అయితే నిర్మాతలకు భారీ ఎత్తున ఆర్థిక నష్టం వాటిల్లుతుందని న్యాయస్థానం ఈ సందర్భంగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో భాగంగానే 'పెద్ది' సినిమాను ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, డౌన్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం లేదా కాపీ చేయడం వంటి చర్యలను పూర్తిగా నిరోధిస్తూ కఠిన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా సినిమా ఇండస్ట్రీని పైరసీ మహమ్మారి చాలా కాలంగా వేధిస్తోంది. ఇటీవల విజయ్ నటించిన 'జననాయగన్' సినిమా విడుదలకు ముందే ఇంటర్నెట్‌లో ప్రత్యక్షమవడం చిత్ర పరిశ్రమను తీవ్రంగా కలవరపెట్టింది. ఇలాంటి నష్టాలు 'పెద్ది' సినిమాకు రాకూడదనే ఉద్దేశంతో చిత్ర యూనిట్ ముందస్తుగా మేల్కొని న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కోర్టు ఇచ్చిన ఈ 'డైనమిక్ ఇంజంక్షన్' ఉత్తర్వుల ప్రకారం.. పైరసీదారులు ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిన వెంటనే, మళ్లీ కొత్త యూఆర్ఎల్ లేదా కొత్త పేరుతో అదే కంటెంట్‌ను అప్‌లోడ్ చేయడానికి ప్రయత్నించినా, ఆ కొత్త సైట్లు కూడా ఆటోమేటిక్‌గా బ్లాక్ అయిపోతాయి. డిజిటల్ యుగంలో పైరసీని అడ్డుకోవడానికి ఇదొక అత్యుత్తమ న్యాయపరమైన రక్షణగా నిలువబోతుంది. 'పెద్ది' టీమ్ తీసుకున్న ఈ ముందస్తు చర్యను టాలీవుడ్ వర్గాలతో పాటు సినిమా విశ్లేషకులు, ప్రేక్షకులు సైతం ఎంతో అభినందిస్తున్నారు.






## రణ్‌వీర్ బ్యాన్.. అంతా తూచ్!

ఫర్హాన్ అక్తర్ డాన్ 3 చుట్టూ గత కొన్ని రోజులుగా ఒక పెద్ద వివాదం నడుస్తోంది. ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ రణ్‌వీర్ సింగ్‌ను చిత్ర పరిశ్రమ నుండి పూర్తిగా 'నిషేధించింది' అంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు హల్‌చల్ చేశాయి. అయితే ఈ వివాదంపై ఎఫ్‌డబ్ల్యూఐసీఈ తాజాగా అధికారికంగా స్పందిస్తూ తీవ్రతను తగ్గించింది. రణ్‌వీర్ సింగ్ –డాన్ 3– వివాదాన్ని చాలామంది తప్పుగా అర్థం చేసుకున్నారని సంస్థ స్పష్టం చేసింది. ఈ వివాదానికి అసలు కారణం రణ్‌వీర్ సింగ్ అకస్మాత్తుగా –డాన్ 3– ప్రాజెక్ట్ నుండి తప్పుకోవడమే. ఈ సినిమా షూటింగ్ కోసం యూనిట్ విదేశాలకు బయలుదేరడానికి కేవలం మూడు వారాల ముందు అతడు ఈ నిర్ణయం తీసుకున్నారని ఫర్హాన్ వాదిస్తున్నారు. తాము సెట్స్ కి వెళ్లక ముందే ఈ ప్రాజెక్టుపై 45కోట్లు పైగా పెట్టుబడి పెట్టామని, రణ్ వీర్ తప్పుడు నిర్ణయంతో దానిని తాము నష్టపోవాల్సి వచ్చిందని నిర్మాత ఫర్హాన్ వాదిస్తూ ఎఫ్‌డబ్ల్యూఐసీఈకి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అతడికి మూడు నోటీసులు.. మూడు రిమైండర్లు పంపినా స్పందన రాకపోవడంతో అతడిపై నిషేధం విధించారనే ప్రచారం సాగింది. అయితే ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చీఫ్ అడ్వైజర్ అశోక్ పండిట్ ఈ ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా పూర్తిగా ఖండించారు. రణ్‌వీర్ సింగ్‌పై విధించింది –నిషేధం– కాదని.. అది కేవలం –సహకరించకూడదనే ఆదేశం– మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ రకమైన ఆదేశం వల్ల పరిశ్రమలోని కార్మికులు, సాంకేతిక నిపుణులు సదరు నటుడితో పని చేయాలా వద్దా అనేది వారి వ్యక్తిగత నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

## ఈటీవీలో ఓజీ!

ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతూ డిజిటల్ ప్రేక్షకులను అలరిస్తోన్న ఓజీ.. శాటిలైట్ హక్కులను ప్రముఖ తెలుగు ఎంటర్‌టైన్‌మెంట్ ఛానల్ ఈటీవీ భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమాను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ప్రసారం చేయడానికి ఛానల్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ వార్తతో పవన్ అభిమానులు మరింత ఎగ్జైట్




అవుతున్నారు. థియేటర్లలో, ఓటీటీలో ఇప్పటికే మంచి రెస్పాన్స్ తెచ్చుకున్న ఈ సినిమా.. టెలివిజన్‌లో కూడా భారీ టీఆర్పీ రేటింగ్స్ నమోదు చేసే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. త్వరలోనే అధికారిక ప్రకటనతో పాటు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ డేట్ కూడా వెల్లడయ్యే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. పండుగ సీజన్‌ను టార్గెట్ చేస్తూ ఈ సినిమా టీవీ ప్రీమియర్‌ను ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత డీవీవీ దానయ్య ఈ సినిమాను నిర్మించారు.



## ఛాంబర్‌కి పవన్ అపాయింట్‌మెంట్?

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో గత కొన్ని రోజులుగా నిర్మాతలకు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల ఎగ్జిబిటర్లకు మధ్య రెవెన్యూ మోడల్‌కు సంబంధించిన వివాదం తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. థియేటర్లలో రెంట్ విధానానికి బదులుగా పర్సంటేజీ సిస్టమ్ (రెవెన్యూ షేరింగ్) అమలు చేయాలని ఎగ్జిబిటర్లు పట్టుబడుతుండగా, నిర్మాతల వైపు నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇండస్ట్రీలో నెలకొన్న తాజా పరిస్థితులు సమస్యలపై చర్చించేందుకు తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కీలక అడుగు వేసింది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలిసేందుకు సమయం ఇవ్వాలని కోరుతూ ఛాంబర్ అధికారికంగా లేఖ రాయడం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



## భావోద్వేగ బలం హీరోయిన్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. అయితే తాజాగా ప్రముఖ దర్శకుడు హేమంత్ మధుకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో హీరోయిన్ పాత్రల గురించి మాట్లాడిన హేమంత్ మధుకర్.. ఆయన సినిమాల్లో కనిపించే రొమాంటిక్ సన్నివేశాలను చూసి హీరోయిన్లకు కేవలం గ్లామర్ పాత్రలే ఉంటాయని అనుకోవడం తప్పని అన్నారు. సందీప్ తన కథల్లో మహిళా పాత్రలను చాలా బలంగా, భావోద్వేగాలకు దగ్గరగా రాస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'అర్జున్ రెడ్డి'లో శాలినీ పాండే పోషించిన ప్రీతి పాత్రను, అలాగే 'యానిమల్'లో రష్మిక మందన్న చేసిన గీతాంజలి పాత్రను ఉదాహరణగా చెప్పారు. ఆ పాత్రలు కేవలం హీరోకు జోడీగా మాత్రమే కాకుండా కథలో కీలకమైన భావోద్వేగ బలాన్ని ఇచ్చాయని అన్నారు.



## రెండో రౌండ్‌లోనే సిన్నర్ ఔట్

**ఫ్రెంచ్ ఓపెన్‌లో పెను సంచలనం**

పారిస్‌లో జరుగుతున్న ఫ్రెంచ్ ఓపెన్‌లో పెను సంచలనం నమోదైంది. వరల్డ్ నెంబర్ 1, ఇటలీ స్టార్ ఆటగాడు యానిక్ సిన్నర్ రెండో రౌండ్‌లోనే టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు. గురువారం జరిగిన మ్యాచ్‌లో అర్జెంటీనాకు చెందిన జువాన్ మాన్యుయెల్ సెరుండోలో చేతిలో సిన్నర్ ఊహించని ఓటమిని చవిచూశాడు. గెలుపు అంచున నిలిచిన సిన్నర్, కాళ్లలో తీవ్రమైన నొప్పితో కుప్పకూలిపోవడంతో ఈ అనూహ్య ఫలితం వెలువడింది. తొలి రెండు సెట్లను 6-3, 6-2 తేడాతో సునాయాసంగా గెలిచిన సిన్నర్, మూడో సెట్‌లోనూ 5-1 ఆధిక్యంలో నిలిచాడు. ఇక సిన్నర్ గెలుపు ఖాయమని అందరూ భావిస్తున్న తరుణంలో మ్యాచ్ నాటకీయంగా మలుపు తిరిగింది. సిన్నర్‌ను తీవ్రమైన శారీరక ఇబ్బందులు చుట్టుముట్టాయి. రెండుసార్లు మ్యాచ్‌ను గెలుచుకోవడానికి సర్వ్ చేయడంలో విఫలమయ్యాడు. కండరాలు పట్టేయడంతో మెడికల్ టైమ్‌అవుట్ కూడా తీసుకున్నాడు. అక్కడి నుంచి సిన్నర్ కోలుకోలేకపోయాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ప్రపంచ 56వ ర్యాంకర్ సెరుండోలో.. చివరి 20 గేమ్‌లలో 18 గెలుచుకుని అద్భుతం చేశాడు. ఫలితంగా 3-6, 2-6, 7-5, 6-1, 6-1 తేడాతో సిన్నర్‌పై చారిత్రక విజయం సాధించాడు. ఈ విజయంతో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలిసారి మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. ఈ ఓటమితో కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేయాలన్న సిన్నర్ ఆశలకు గండి పడింది. అంతేకాకుండా, ఈ సీజన్‌లో అతని 30 మ్యాచ్‌ల విజయ పరంపరకు కూడా తెరపడింది. మరోవైపు, సిన్నర్ ఔట్ కావడం, అల్కరాజ్ గాయంతో దూరమవ్వడంతో ఈసారి టోర్నీలో కొత్త ఛాంపియన్ అవతరించే అవకాశం ఏర్పడింది.




## కార్లసన్‌కు ప్రజ్ఞానంద షాక్

భారతీయ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద సంచలనం సృష్టించాడు. ప్రపంచ నెంబర్ వన్ ప్లేయర్ మాగ్నస్ కార్లసన్‌పై అద్భుత విజయం సాధించారు. నార్వే చెస్ టోర్నమెంట్‌లో స్వంతగడ్డపై కార్లసన్‌ను ప్రజ్ఞానంద ఓడించాడు. దీంతో మూడు ఫుల్ పాయింట్లను అతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక వరల్డ్ చాంపియన్ డీ గుకేశ్ మాత్రం మరో ఓటమిని మూటకట్టుకున్నాడు. నార్వేలో కార్లసన్ అజేయయాత్రకు ప్రజ్ఞానంద మరోసారి బ్రేక్ వేశారు. ఏడు సార్లు చాంపియన్ అయిన కార్ల్‌సన్‌ను ఆయన స్వంత దేశంలోనే మళ్లీ ఓడించారు. చెస్ చరిత్రలో ఇదో ఘనమైన రికార్డుగా భావిస్తున్నారు. గత ఏడాది కూడా ఇక్కడే కార్లసన్‌పై ప్రజ్ఞానంద విక్టరీ కొట్టాడు. ఇటీవల రొమేనియాలోని బుచారెస్ట్‌లో జరిగిన సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ టోర్నీలో ప్రజ్ఞానంద విజయం సాధించారు. అయితే ఆ కాన్ఫిడెన్స్‌తోనే తాజాగా నార్వే చెస్ టోర్నీలో అతను అడుగుపెట్టాడు. ప్రస్తుతం కార్లసన్ కేవలం 1.5 పాయింట్లతో పోరాడుతున్నారు. నార్వే చెస్‌లో క్లాసిక్ విభాగంలో రెండోసారి ప్రజ్ఞానంద గెలుపొందాడు. డీ గుకేశ్‌పై విజయం సాధించిన ఫిరౌజా ప్రస్తుతం టోర్నీలో టాప్ ప్లేస్‌లో దూసుకెళ్తున్నాడు. అతను క్లాసిక్ గేమ్‌లో కీలకమైన 1.5 పాయింట్లు సాధించి మొత్తం 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. ఇవాళ ఫోర్త్ రౌండ్‌లో గుకేశ్, కార్లసన్ మధ్య మ్యాచ్ జరగనున్నది. ఈ మ్యాచ్‌పైనే అందరి దృష్టి నెలకొన్నది.









# ఫైనల్ బెర్తు ఎవరిదో!

## గుజరాత్ వర్సెస్ రాజస్థాన్.. క్వాలిఫయర్-2కు వర్షం ముప్పు

**ఐపీఎల్ 2026లో కీలకమైన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు శుక్రవారం ముల్లాన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో తలపడనున్నాయి. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.**

**వాతావరణ శాఖ అంచనాల ప్రకారం మ్యాచ్ ప్రారంభానికి కొద్దిసేపటి ముందు ముల్లాన్‌పూర్ ప్రాంతంలో చిరుజల్లులు, చెదురుమదురు ఉరుములు నమోదయ్యే అవకాశం ఉంది. దీంతో టాస్ లేదా మ్యాచ్ ప్రారంభం ఆలస్యమయ్యే అవకాశముందని అభిమానులు ఆందోళన చెందుతున్నారు.**

ఈ మ్యాచ్ విజేత మే 31న అహ్మదాబాద్‌లో జరిగే ఐపీఎల్ 2026 ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. దీంతో ఈ పోరు ఇరు జట్లకు "డూ ఆర్ డై"గా మారింది. లీగ్ దశలో గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్‌ను 72 పరుగుల తేడాతో చిత్తు చేసింది. అయితే ప్లేఆఫ్స్‌కు వచ్చేసరికి పరిస్థితులు పూర్తిగా మారాయి. రాజస్థాన్ వరుసగా మూడు విజయాలతో జోష్‌లో ఉండగా, గుజరాత్ మాత్రం క్వాలిఫయర్-1లో ఆర్సీబీ చేతిలో భారీ ఓటమిని చవిచూసింది.

### వైభవ్ సూర్యవంశీపై అందరి దృష్టి

రాజస్థాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం టోర్నీలో హాట్ టాపిక్‌గా మారాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఎలిమినేటర్ మ్యాచ్‌లో 29 బంతుల్లో 97 పరుగులు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అతడు మరోసారి విజృంభిస్తే పవర్‌ప్లేలోనే మ్యాచ్‌ను రాజస్థాన్ వైపు తిప్పేయగలడని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే సూర్యవంశీ త్వరగా ఔటైతే రాజస్థాన్ మధ్యతరగతి బ్యాటింగ్ బలహీనత బయటపడే అవకాశముంది. అదే సమయంలో గుజరాత్ బౌలింగ్ దళం బలంగా నిలుస్తోంది. క్వాలిఫయర్-1లో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ 33 బంతుల్లో 93 పరుగులతో చెలరేగగా, గుజరాత్ ఫీల్డర్లు కీలక క్యాచ్‌లు వదిలేశారు. రాజస్థాన్‌పై అలాంటి తప్పిదాలు చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని క్రికెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**జట్లు**

**గుజరాత్ టైటాన్స్:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్, రషీద్ ఖాన్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కగిసో రబడా, సాయి సుదర్శన్, రాహుల్ తేవాటియా తదితరులు.

**రాజస్థాన్ రాయల్స్:** రియాన్ పరాగ్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్, రవి బిష్ణోయ్, శిమ్రాన్ హెట్‌మైర్ తదితరులు.




## కోల్‌కతాలో గంగూలీ బయోపిక్ షూటింగ్

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, బెంగాల్ దాదా సౌరవ్ గంగూలీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక బయోపిక్ 'దాదా: ది సౌరవ్ గంగూలీ స్టోరీ'. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కోల్‌కతాలో శరవేగంగా సాగుతోంది. ముంబై షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న చిత్ర యూనిట్, ప్రస్తుతం కోల్‌కతాలో 15 రోజుల సుదీర్ఘ షెడ్యూల్‌ను ప్రారంభించింది. గంగూలీ జీవిత ప్రయాణంతో ముడిపడి ఉన్న పలు కీలక ప్రాంతాలలో ఈ చిత్రీకరణ జరుగుతున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో సౌరవ్ గంగూలీ పాత్రను బాలీవుడ్ విలక్షణ నటుడు రాజ్‌కుమార్ రావు పోషిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ కోల్‌కతాలో జరుగుతుండగా.. దీనికి సంబంధించిన ఫొటోలు బయటకు వచ్చాయి. రాజ్‌కుమార్ రావు ఎరుపు రంగు ట్రాక్‌సూట్ ధరించి 'దాదా' లుక్‌లో కనిపించి అభిమానులను అలరించాగా. కోల్‌కతా వీధుల్లో సాగిన గంగూలీ తొలినాళ్ల కష్టాల నుంచి లార్డ్స్ మైదానంలో టీ-షర్ట్ విదిల్చిన చారిత్రాత్మక క్షణం వరకు, 'గాడ్ ఆఫ్ ది ఆఫ్-సైడ్' ప్రయాణాన్ని దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తుంది. ఐపీఎల్ సీజన్ ముగియడంతో ఈడెన్ గార్డెన్స్ మైదానంతో పాటు దుఖీరామ్ క్రికెట్ కోచింగ్ సెంటర్‌లో కూడా కీలకమైన సీన్స్ షూట్ చేస్తున్నారు. విశేషం ఏమిటంటే.. సౌరవ్ గంగూలీ స్వయంగా తన నివాసంలో మరియు ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన షూటింగ్ సమయాల్లో హాజరై చిత్ర యూనిట్‌ను పర్యవేక్షించినట్లు సమాచారం.

## వైభవ్ సిక్స్ మెషీన్: గేల్

యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్.. యూనివర్సల్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీపై ప్రశంసలు కురిపించారు. తాజా ఐపీఎల్‌లో గేల్ రికార్డును వైభవ్ బ్రేక్ చేసిన విషయం తెలిసిందే. ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు గేల్ పేరిట ఉన్నది. అయితే బుధవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్థాన్ బ్యాటర్ వైభవ్ ఆ రికార్డును బ్రేక్ చేశాడు. 2012 సీజన్‌లో గేల్ 59 సిక్సర్లు బాదాడు. ఇక ఇప్పుడు సూర్యవంశీ ఇప్పటికే 65 సిక్సర్లు కొట్టేశాడు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో హైదరాబాద్‌పై అతను ఏకంగా 12 సిక్సర్లు బాదాడు. 29 బంతుల్లో 97 రన్స్ చేసిన వైభవ్‌పై యూనివర్సల్ బాస్ గేల్ ప్రశంసలు కురిపించారు. వైభవ్ సూర్యవంశీ అసాధారణ బ్యాటింగ్ చేస్తున్నాడని, అతనో కొత్త సిక్స్ మెషీన్ అని గేల్ అన్నారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో గేల్ స్పందిస్తూ వైభవ్ ను సిక్స్ మెషీన్‌తో పోల్చారు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో మరో రికార్డును నెలకొల్పే అవకాశాన్ని సూర్యవంశీ మిస్సయ్యాడు. ఫాస్టెస్ట్ హండ్రెడ్ చేసే అవకాశాన్ని వైభవ్ చేజార్చుకున్నాడు. ఆ రికార్డును మిస్ కావడం దురదృష్టకరమని, ఎలాగైనా ఆ రికార్డును అతను అధిగమిస్తాడని వైభవ్‌పై గేల్ ప్రశంసలు కురిపించాడు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సూర్యవంశీ 15 ఇన్నింగ్స్‌లో 680 రన్స్ చేశాడు. యావరేజ్ 45.33గా ఉంది. ఇక స్ట్రయిక్ రేట్ 242.85గా ఉంది. ఓ సెంచరీతో పాటు నాలుగు ఫిఫ్టీలు అతని ఖాతాలో ఉన్నాయి. ఈ సీజన్‌లో వైభవ్ బెస్ట్ స్కోరు 103. 280 బంతులు ఎదుర్కొన్న అతను మొత్తం 55 ఫోర్లు 65 సిక్సర్లు బాదాడు.



## వెల్‌డన్ వైభవ్: కావ్యా

ఐపీఎల్ 2026 ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. నిన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ( ఎస్ఆర్‌హెచ్)తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడి అసాధారణ ఆటతీరు ప్రత్యర్థి జట్టు యాజమాన్యాన్ని సైతం ఆకట్టుకుంది. ముఖ్యంగా ఎస్ఆర్‌హెచ్ సహ యజమాని కావ్య మారన్ చూపిన క్రీడా స్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది. మ్యాచ్ అనంతరం కావ్య మారన్ స్వయంగా వైభవ్ వద్దకు వెళ్లి అతడిని ప్రత్యేకంగా అభినందించారు. యువ ఆటగాడితో కరచాలనం చేసి, ప్రశంసలు కురిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# తెలంగాణ అస్తిత్వంపై పదే పదే దాడి

సుదీర్ఘ పోరాటాలు, వందలాది మంది అమరుల త్యాగాల పునాదులపై సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం నేడు దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపుతో దూసుకుపోతోంది. భౌగోళికంగానే కాకుండా, సాంస్కృతికంగా, చారిత్రకంగా ఎంతో విశిష్టత కలిగిన ఈ ప్రాంతం పట్ల కొందరిలో ఇంకా పాత భావజాలం, చిన్నచూపు పోలేదనడానికి ఇటీవల జరిగిన మహానాడు వేదిక సాక్ష్యంగా నిలిచింది. ఒక రాజకీయ పార్టీ పండుగగా జరుపుకునే వేదికపై, తెలంగాణ గొప్పదనాన్ని, ఇక్కడి ప్రజల ఆకాంక్షలను కించపరిచేలా సాగిన ప్రసంగాలు, చర్యలు అత్యంత విచారకరం, ఖండనార్హం. ఇది కేవలం రాజకీయ విమర్శ మాత్రమే కాదు, తెలంగాణ సమాజ ఆత్మగౌరవాన్ని గాయపరిచే వ్యూహాత్మక ప్రయత్నం. ఏ రాజకీయ పార్టీకైనా తన సిద్ధాంతాలను ప్రచారం చేసుకునే హక్కు, ప్రజా సమస్యలపై చర్చించే స్వేచ్ఛ ఉంటుంది. కానీ ఆ ప్రక్రియలో పక్క రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను, వారి అస్తిత్వాన్ని తక్కువ చేసి మాట్లాడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. మహానాడు వేదికపై తెలంగాణ ప్రస్తావన తెస్తూ, ఇక్కడి సంస్కృతిని, భాషను, సాధించిన అభివృద్ధిని అవహేళన చేసేలా మాట్లాడటం వెనుక దాగి ఉన్న ప్రాంతీయ అహంకారం స్పష్టంగా కనిపిస్తోంది. ఓట్ల కోసం, రాజకీయ ఉనికి కోసం ఒక ప్రాంత ప్రజల ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టడం ఏ రకమైన రాజకీయాలో ఆయా పార్టీల నాయకులే ఆత్మవిమర్శ చేసుకోవాలి. తెలంగాణ అనేది కేవలం ఒక భూభాగం కాదు, అణచివేతపై తిరగబడిన ఒక చైతన్యం. వీరనారి చాకలి ఐలమ్మ, కొమరం భీమ్, దొడ్డి కొమరయ్య వంటి ఎందరో యోధుల పోరాటాల గడ్డ ఇది. అలాంటి గడ్డపై నిలబడి, లేదా ఈ గడ్డను ఉద్దేశించి తక్కువ అంచనా వేయడం అంటే చరిత్రను సరిగ్గా చదవకపోవడమే అవుతుంది. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ అన్ని రంగాలలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. వ్యవసాయం, ఐటీ, పరిశ్రమలు, సంక్షేమ పథకాల్లో అగ్రగామిగా దూసుకుపోతున్న రాష్ట్రాన్ని చూసి ఓర్వలేకనే ఇలాంటి చౌకబారు విమర్శలకు దిగుతున్నారనేది స్పష్టమవుతోంది. తెలంగాణ యాసను, ఇక్కడి జీవన విధానాన్ని గతంలో సినిమా వేదికలపై, అధికార వర్గాల్లో ఎలా అవహేళన చేశారో ప్రజలు ఇంకా మర్చిపోలేదు. మళ్లీ ఇప్పుడు రాజకీయ వేదికలపై అదే ధోరణిని ప్రదర్శించడం తెలంగాణ సమాజాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. బతుకమ్మ, బోనాలు వంటి విశిష్ట సంస్కృతి కలిగిన ఈ నేల సగర్వంగా తన అస్తిత్వాన్ని చాటుకుంటుంటే, దానిని అగౌరపరిచేలా ప్రవర్తించడం వారి సంకుచిత మానసిక స్థితిని తెలియజేస్తోంది. తెలంగాణ సమాజం ఎల్లప్పుడూ సహనంతో, మర్యాదతో ఉంటుంది. కానీ ఆత్మగౌరవానికి భంగం కలిగితే మాత్రం ముక్తకంఠంతో ఎదురిస్తుంది. ఇప్పటికైనా బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేసిన వారు, ఆ చర్యలకు కారణమైన వారు తమ తీరును మార్చుకోవాలి. తెలంగాణ వైభవాన్ని, ప్రజల ఆకాంక్షలను తక్కువ చేసి చూపే ఎలాంటి ప్రయత్నాలనైనా ఇక్కడి ప్రజలు ఎన్నటికీ అంగీకరించరు, సహించరు. రాజకీయాలు తాత్కాలికం, కానీ ప్రాంతీయ అస్తిత్వం, ఆత్మగౌరవం శాశ్వతం అనే సత్యాన్ని గ్రహించాల్సి ఉంది.



## కాలుష్యం!

మనిషి చెట్లనే
ఊపిరితిత్తులను కోసి
భూమాత చుట్టూ
ప్లాస్టిక్ దయ్యంను
పట్టించి ఓజోన్ పొరకు
పొక్క పెడుతున్నాడు
అభివృద్ధి అంటూ
అంతరిక్షంకు నిచ్చెన వేస్తూ
అబ్బబ్బ కాలుష్యమని
బొబ్బలు పెడుతున్నాడు
మనిషి తను కూర్చున్న కొమ్మను
తాను నరకడమంటే ఇదేనేమో!

కవి: నాగం సాయిలు
(నానీ మీగడలు రచయిత)
ఫోన్:9490209037



## తెలియనితనం

దేవా!
విజయాల వృక్షాలు నీవు ఇచ్చావు
విషఫలాలు నేను కొని తెచ్చుకున్నాను,

స్వామీ!
ఒప్పులదారిని నీవు చూపావు
తప్పుల అడుగులు నేను వేసాను,

తండ్రీ!
అదృష్టరేఖలు నీవు గీసావు
అస్పష్ట గీతలు నేను మోసాను,
ప్రభూ!
తీరాల్సినవన్నీ నీవు కూర్చావు
కోరికలంటు కొన్నే నేను దాల్చాను,

భగవాన్ !
తీరాల చోటును నీవు మలిచావు
మార్గాల వేటలో నేను
నడిచాను,

దేవా!తండ్రీ !
స్వామీ! ప్రభూ!భగవాన్!
జీవనవనమును నీవు నాకు కట్టావు,
బతుకు అడవిలో నేను తప్పిపోతున్నాను !

-డాక్టర్ కాసర్ల నరేశ్ రావు
9441406252

# రేపటితరం కోసం..!

**పరిసరాల అనుభవాలకు ప్రతిస్పందించే హృదయమే కవికి ఉండవలసిన అతి ముఖ్యమైన విషయం. అలాంటి లక్షణం ఉన్న యువకవి మన మల్లయ్య. అందుకే తనకు కలిగిన అనుభవాలను తాను పొందిన అనుభూతులకు అక్షరరూప సాక్ష్యమే "రేపటి తరం కోసం" కవితా సంపుటి!**

ఈ సంపుటి యందు తన మాటలుగా రేపటి తరం కోసం తాను రాసిన కొన్ని పంక్తులు.. "ఉద్యోగం కోసం చదవకు, ఉన్నతంగా బతకడం కోసం చదువు". "మార్కుల కోసం చదవకు, మార్పు కోసం చదువు". "వ్యక్తిగత ప్రయోజనం కోసం చదవకు, భావితరాలకు మార్గనిర్దేశం కోసం చదువు". అని రేపటి తరం కోసం ఇచ్చిన సందేశం. అలాగే ఎదుటివారిని ఎదురించి గెలిచేకన్నా వారి మనసును గెలవాలనే విధంగా " ఎదుటివారిని ఎదిరించాలని చూడకు ఏదో ఒకరోజు మరణిస్తావు. ఎదుటివాడి మనస్సును గెలిచి చూడు ఎల్లకాలం జీవించే ఉంటావు". అని అద్భుత మాటలతో గెలుపు మంత్రాన్ని ఉపదేశిస్తాడు.




**ముఖ్యంగా ఈ పుస్తక రచన కాలం "కరోనాకాలం". ఇలాంటి సమయంలో తనకు లభించిన సమయాన్ని కలంతో కలకాలం గుర్తుండే విధంగా ఈ సంపుటిని సంకలనం చేయబడినట్లు కవి గారి కవితల ద్వారా తెలుస్తున్నది. ఇలాంటి విపత్కర సమయంలో "అవని అంతా ఆందోళన చెందుతుంటే నాకేం భయం అనే కావరమెందుకు, కాలు బయట పెడితే కాటికి వెళ్తావంటే గేలి చేస్తావెందుకు అంటూ "ఓ మూర్ఖత్వపు మనిషి" కవితలో మనిషి మూర్ఖత్వానికి హెచ్చరిక చేశాడు.**

మహమ్మారి విలయతాండవం చేస్తున్నప్పుడు ముఖ్యంగా వైద్యులు, పోలీసులు సమాజానికి చేసిన సేవలను కొనియాడుతూ "జాతి అంతా జంకుతున్న ప్రపంచాన్ని వనికిస్తున్న కరోనా పై యుద్ధం చేస్తున్న యుద్ధ వీరుడు అని వైద్యుడిని, మరియు పగలు రాత్రి పండుగ పబ్బమెరుగక ఆపద ఎక్కడుంటే అక్కడ ఆన్ డ్యూటీలో నువ్వు ఉంటావని" పోలీసు సేవలను కొనియాడుతూ.., సలాం పోలీస్ అన్నా అని ఖాకీ

### చొక్కకు సెల్యూట్ చేస్తాడు.

బాల్యంలో తన తల్లిదండ్రులతోగడిపిన క్షణాలను గుర్తుకు తెచ్చుకుంటూ "పొద్దు పొద్దున్నే అమ్మ వీపుపై మోస్తూ వాకిలి ఊడుస్తుంటే గుర్రం గుర్రం అని ఆనందపడిన క్షణం, నాన్న ఎదపై నడుస్తూ అల్లరి చేసిన తీపి గుర్తులను" తన బాల్యం కవితలో వర్ణన ఎంతో సహజంగా అనిపిస్తుంది. ప్రేమించిన ప్రియురాలు సాకులు చెప్పినప్పుడు "ప్రేమించినప్పుడు నా పేదింటి గురించి నీకు తెలియదా ప్రియా, లగ్గం చేసుకుందామంటే ఆస్తి ఏముంది ఎలా సాకుతావు అని సాకులు చెప్పి సన్యాసిని చేశావే" అంటూ స్వచ్ఛమైన నిజాయితీ గలదే పేదింటి ప్రేమ అని తెలుసుకో అని పేదింటి ప్రేమ వ్యక్తీకరణలో స్వచ్ఛత మరియు ఆడవారికి ఆడవారు శత్రువు కాదని నిరూపించు అని "అంతా నువ్వే" అనే కవితలో ఆడవారి ఔనత్యాన్ని వర్ణించారు.

ప్రైవేటు బోధనా ఉద్యోగాల బాధను వర్ణిస్తూ "మరో ఉద్యోగం చేయలేని ఉపాధ్యాయ జీవితం మా ప్రైవేటు ఫ్యాకల్టీ జీవితం, సంసారం ఎల్లదీయలేని సంపాదన మాదంటూ" తన ఆవేదనను ఫ్యాకల్టీ జీవితంలో వ్యక్తపరిచాడు.

తనకు స్ఫూర్తినిచ్చిన కలాం గారి స్ఫూర్తితో నాకూఎదగాలని ఉంది అనే కవితను, ఆకలి తీర్చే అన్నయ్య అనే వాక్యాలతో జాతీయ హీరోగా కరోనా కాలంలో కొనియాడ బడిన సోనుసూద్ గారి సేవలను, సినారే స్ఫూర్తిని, పి. వి. గారి ఠీవిని స్ఫూర్తి మంత్రంగా తెలుగు తేజాలు కవితలో వర్ణన. నమ్మకమిద్దాం " ఆమెకు అవకాశాలు కల్పించి, స్వేచ్ఛగా మాట్లాడి, తన కృషితో తాను ఎదగడానికి స్త్రీ జాతికి సహకరిద్దాం". అనే స్త్రీ స్వేచ్ఛ స్వాతంత్ర్యల గూర్చి రేపటితరం కోసం ప్రచురించిన ఈ కవితా సంపుటియందలి కొన్ని ముఖ్యమైన పంక్తులు. నా విన్నపం అంటూ పాఠకులకు తన రచనా జీవితాన్ని పరిచయం చేశాడు కవి మల్లయ్య. ప్రస్తుత మహిళా విశ్వవిద్యాలయం కోఠి వీసీ ఆచార్య సూర్యధనుంజయ గారు రేపటి తరం కోసం కవితా సంపుటిని ఆశీరభినందన అంటూ తన శిష్యుడైన కవి మల్లయ్యని ముందు మాటలో కవితా ప్రయాణానికి మానసారా అందించిన దీవేనలు, అంకుర వాక్యాలతో సుధా శ్రీ బసోజు సుధాకారాచారి పంక్తులు పుస్తకాన్నికి బలాన్ని అందిస్తాయి.

**సమీక్షకుడు**
రాచూరి రామచంద్ర, గణిత బోధకుడు
ఫోన్ నంబర్: 9948872423

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.